
VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A, New Zealand)
1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
91(40) 27628134, 27674037
victoria.ashoknagar@gmail.com
www.victoriaoverseas.com
AAERI QEAC No. E334

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 22, పేజీలు - 08
శుక్రవారం, జూలై 17, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# బీఆర్ఎస్ టార్గెట్ గ్రేటర్




**- ఎన్నికల కోసం మైక్రో లెవల్ ప్లానింగ్ - స్పెషల్ వార్ రూమ్ - కేటీఆర్ ఇజ్జత్‌కా సవాల్!**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపైనే పడింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మారిన పొలిటికల్ ఈక్వేషన్లతో ఈ ఏడాదిలోనే రాబోయే గ్రేటర్ ఎన్నికలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. హైదరాబాద్‌ను తమ పార్టీకి బలమైన కోటగా నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు. దీనికోసం నగరంలో తెరవెనుక ఒక భారీ వార్ రూమ్ రన్ అవుతున్నట్లు, అందులోంచే వ్యూహాత్మక ఆపరేషన్లు నడుస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.

## మైక్రో లెవల్ ప్లానింగ్ పై కేటీఆర్ దృష్టి

ఈ సారి కేటీఆర్ కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, మైక్రో-లెవెల్ ప్లానింగ్‌పై దృష్టి పెట్టారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని డివిజన్ల వారీగా ఓట్ల మార్పిడి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు అక్రమంగా ఓట్లను తొలగించకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేశారు. నియోజకవర్గాల వారీగా అసెంబ్లీ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో నిరంతరం టచ్‌లో ఉంటూ వరుస సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏ ఒక్క చిన్న అవకాశాన్ని కూడా వదిలిపెట్టకూడదనే సంకల్పం ఆయన ప్లానింగ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.

## రెండు గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పట్టు

ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరకముందు, హైదరాబాద్ మహానగరంలో గులాబీ పార్టీకి అసలు ఉనికి ఉండేది కాదు.

ఉమ్మడి రాష్ట్రంలో గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా వెనుకాడిన సందర్భాలు ఉన్నాయి. కానీ మలి దశ ఉద్యమం, ఆ తర్వాత పదేళ్ల అధికార కాలంలో ఐటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడం ద్వారా బీఆర్ఎస్ ఇక్కడ తిరుగులేని పట్టు సాధించింది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారం లేనప్పటికీ.. నగర ప్రజలు ఇప్పటికీ తమవైపే ఉన్నారని, తమ బలం తగ్గలేదని నిరూపించుకోవాల్సిన అగ్నిపరీక్ష కేటీఆర్ ముందుంది.

**గెలుపు బీఆర్ఎస్‌కు అత్యంత అవసరం**

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో గ్రేటర్ ఎన్నికల్లో గెలవడం బీఆర్ఎస్ మనుగడకు ఎంత అవసరమో కేటీఆర్‌కు బాగా తెలుసు. ఒకవేళ ఇక్కడ గనుక పట్టు కోల్పోతే, పార్టీ కేడర్ నైరశ్యంలోకి వెళ్లడమే కాకుండా వలసల తీవ్రత పెరిగే ప్రమాదం ఉంది. అందుకే జీహెచ్ఎంసీ ఎన్నికలను డూ ఆర్ డై బ్యాటిల్‌గా భావించి కేటీఆర్ రంగంలోకి దిగారు. ఇటీవల జరిగిన రివ్యూ మీటింగుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుని, కార్పొరేటర్ టికెట్లు ఆశించే వారు ప్రజల్లోనే ఉంటూ పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది చివర్లో ఎలాగైనా గ్రేటర్ పీఠాన్ని దక్కించుకుని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడింది తామేనని నిరూపించడమే కేటీఆర్ ఏకైక

2లో..

# కేబినెట్ భేటీలో సీఎం విజయ్ ఫైర్

**- అవినీతి ఊసే ఉంటే మంత్రి పదవి అవుట్**
**- తమిళనాడులో విప్లవాత్మక ఆదేశాలు!**




చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ తన మార్క్ పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారు. చెన్నైలో నిర్వహించిన రెండవ కేబినెట్ సమావేశంలో ఆయన మంత్రుల తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు తావులేదని స్పష్టం చేస్తూ ఒకవేళ ఏ మంత్రికైనా అవినీతి మరక అంటినా, ఆరోపణలు రుజువైనా సరే క్షణాల్లో వారి మంత్రి పదవిని రద్దు చేయడానికి వెనుకాడబోనని సీఎం విజయ్ అత్యంత కఠినంగా హెచ్చరించారు.

2లో..

# సీతారామ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేస్తాం

**- ప్రాజెక్టు పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
**- గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి**
**- పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామన్న మంత్రులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడమే

2లో..

# వైసీపీ కార్యకర్తల కోసం సూపర్ యాప్

**- 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరించిన జగన్**




అమరావతి (ప్రశ్న న్యూస్) సమకాలీన రాజకీయాల్లో డిజిటల్ నెట్‌వర్కింగ్, సోషల్ మీడియా వ్యూహాలు అత్యంత కీలకంగా మారిన తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక విప్లవాత్మక అడుగు వేసింది. వైఎస్సార్‌సీపీ

2లో..

# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి



**- 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి**
**- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు**
**- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి**
**- త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన**
**- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు**

అమరావతి (ప్రశ్న న్యూస్) భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ. 1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని సీఎంకి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్ధంగా

2లో..

# పాలభిషేకాలు, జేసీబీ గజమాలలు బంద్

**- టీపీసీసీ సంచలన సర్క్యులర్!**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో భజన సంస్కృతికి, ఆడంబరాలకు అడ్డుకట్ట వేసేలా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఒక చారిత్రాత్మక , సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యక్రమాల్లో నేతలకు పాలాభిషేకాలు చేయడం, జేసీబీలు, బుల్డోజర్ల వంటి భారీ యంత్రాలను ఉపయోగించి భారీ గజమాలలు వేయడాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఒక అధికారిక సర్క్యులర్ జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయని, ప్రతి ఒక్కరూ దీనిని ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంతకంతో విడుదలైన ఈ సర్క్యులర్ లేఖ ప్రకారం తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నైతిక విలువల ప్రకారం ఆహార పదార్థాలను వృధా చేయడం సరైన పద్ధతి కాదని, అందుకే పార్టీ నిర్వహించే ఏ చిన్న లేదా పెద్ద

2లో..

# జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి

**- ఒకరు మృతి, 100 మందికిపైగా గాయాలు**



**పూరీ (ప్రశ్న న్యూస్)** విశ్వప్రసిద్ధ పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. రథయాత్రలో తొక్కిసలాట జరిగి ఒకరు మృతి చెందగా మరో 130 మందికిపైగా గాయపడ్డారు. మరీచకోట్‌కు చేరువలో ఈ దుర్ఘటన సంభవించింది. భక్తులు భారీ సంఖ్యలో రావడంతో అదుపుతప్పి

2లో..

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.?

**- కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని

2లో..

# మద్యం ధరల పెంపు

**- బాటిల్ సైజుల్లోనూ మార్పు**
**- మందుబాబులకు బిగ్ అలర్ట్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మందుబాబులకు బిగ్ షాక్, మద్యం ధరలతో పాటుగా బాటిల్ సైజుల్లోనూ మార్పులు జరగనున్నాయి. ఇప్పటికే ప్రభుత్వానికి మద్యం తయారీ కంపెనీల నుంచి పలు ప్రతిపాదనలు అందాయి. వీటి పైన ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కాగా, మద్యం ధరలు ఏ మేర పెంచాలి ఏ పరిమాణంలో విక్రయించాలనే అంశం పైన సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చారు. నేడు జరిగే కీలక సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.
తెలంగాణలో మద్యం ధరల పెంపు కు తుది కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే కంపెనీల నుంచి

2లో..

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

**- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు**
**- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**
**- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి

2లో..

# నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల

**- 11.21 లక్షల మంది అర్హత**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గురువారం ప్రకటించింది. ఈ పరీక్షలో మొత్తం 11.21 లక్షల మంది విద్యార్థులు మెడికల్ అడ్మిషన్లకు అర్హత సాధించారు. మే 3న జరిగిన అసలు పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకు చెందిన పాన్సుల్ బన్సల్ ఇద్దరూ 720కి 715 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టినతేదీ లేదా పాస్‌వర్డ్‌తో అధికారిక వెబ్‌సైట్ లో లాగిన్ అయి స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

2లో..

# బీఆర్ఎస్ టార్గెట్ గ్రేటర్

లక్ష్యం. ఇందుకోసం ఓటర్ల నమోదు నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు ప్రతి విషయంలోనూ డేటా ఆధారిత వ్యూహాలతో దూసుకుపోతున్నారు. కేటీఆర్ నడుపుతున్న ఈ నిశ్శబ్ద యుద్ధం మరియు క్షేత్రస్థాయి వ్యూహాలు గ్రేటర్ రాజకీయాల్లో ఎలాంటి ఫలితాలను ఇస్తాయో, కూటమి మరియు కాంగ్రెస్ స్పీడ్‌కు ఎలా బ్రేకులు వేస్తాయో చూడాలి.

# కేబినెట్ భేటీలో సీఎం విజయ్ ఫైర్

### అవినీతికి పాల్పడితే పదవి ఊస్టింగే

ఈ కేబినెట్ భేటీలో సీఎం విజయ్ మంత్రులకు క్రమశిక్షణ, నిబద్ధతపై కీలక దిశానిర్దేశం చేశారు. తప్పు చేసిన వారు తమకు తెలిసిన వారైనా, తెలియని వారైనా సరే తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. ప్రజాధనాన్ని కాపాడటం, పారదర్శకమైన సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని మంత్రులకు గట్టిగా గుర్తుచేశారు. సీఎం విజయ్ చేసిన ఈ హెచ్చరికలు తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తున్నాయి.

### పబ్లిసిటీ కోసం తనిఖీలు బంద్

కేబినెట్ సమావేశంలో సీఎం విజయ్ మరో వినూత్నమైన, కీలకమైన ఆదేశాన్ని జారీ చేశారు. తనిఖీల పేరుతో మంత్రులు ఎవరూ ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లకూడదని ఆయన స్పష్టం చేశారు. మంత్రుల హడావుడి పర్యటనల వల్ల క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడతారని, అది పరిపాలనా అంతరాయానికి దారితీస్తుందని విజయ్ అభిప్రాయపడ్డారు. తనిఖీల బాధ్యతలను అధికారులకే వదిలేసి, మంత్రులు పాలనాపరమైన విధానాల రూపకల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. సినిమా రంగం నుండి రాజకీయాల్లోకి వచ్చి సంచలన విజయం సాధించిన విజయ్, తన రెండవ కేబినెట్ సమావేశంలోనే ఇంతటి దూకుడు ప్రదర్శించానికి కారణం వరుసగా వస్తున్న ఆరోపణలే. గత ప్రభుత్వాల హయాంలో విమర్శలు ఎదుర్కొన్న శాఖలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ప్రజల నుంచి వచ్చే అవినీతి ఫిర్యాదులపై సిఎంఓ నేరుగా స్పందిస్తుందని ఆయన హెచ్చరించారు. మంత్రులందరూ తమ తమ శాఖల పనితీరును మెరుగుపరుచుకోవాలే తప్ప, ఆడంబరాలకు తావివ్వకూడదని హితవు పలికారు.

### ప్రజల్లో క్లీన్ ఇమేజ్‌కు ప్రయత్నం

తమిళనాడులో సరికొత్త రాజకీయ శకానికి తెరతీసిన విజయ్ ఈ కఠిన నిర్ణయాల ద్వారా తాను మిగిలిన రాజకీయ నాయకుల కంటే భిన్నమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నానని నిరూపించారు. కేబినెట్ వేదికగా ఆయన మంత్రులకు విధించిన ఈ గడువులు, క్రమశిక్షణా నియమాలు తమిళగ వెట్రి కళగం ప్రభుత్వ ఇమేజ్‌ను ప్రజల్లో అమాంతం పెంచేలా ఉన్నాయి. అవినీతి రహిత తమిళనాడు నిర్మాణమే ధ్యేయంగా సీఎం విజయ్ నడుపుతున్న ఈ పారదర్శక పాలన భవిష్యత్తులో ఎలాంటి ఫలితాలను ఇస్తుందో చూడాలి.

# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి

వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను భాగస్వామ్యం చేయాలి

రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్ధంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని, ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

### వచ్చే కేబినెట్‌కు నూతన విధానం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం–వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

### ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం

ప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి

తొక్కిసలాటకు దారితీసినట్టు తెలుస్తోంది. క్షతగాత్రులను చికిత్స కోసం సమీపంలో ఆసుపత్రులకు తరలించారు. బోడా దండాపై రథం లాగుతుండగా ఈ ఘటన జరిగింది. ఊపిరాడకపోవడంతో ఒక భక్తుడు స్పృహ కోల్పోయినట్లు సమాచారం. అతడిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆసుపత్రికి చేరుకునేసరికే అతడు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. గాయపడిన వారికి అత్యవసర వైద్య బృందాలు చికిత్స అందిస్తున్నాయి. ఘటనా స్థలంలో ఉన్న పోలీసు సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. అధికారులు పరిస్థితిని అంచనా వేస్తున్నారు.

జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిల దివ్య యాత్రను వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు గుమిగూడిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి వివరాలను పోలీసులు వెల్లడించారు. అతడు కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించినట్టు తెలిపారు. ఘటనకు గల కచ్చితమైన కారణం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, భారీ వర్షం కురుస్తున్నప్పటికీ లక్షలాది మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు రథాలవైపు దూసుకురావడంతోనే ఒకరినొకరు నెట్టుకుని, కిందపడిపోయి ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో పలువురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. వాతావరణ శాఖ ప్రకారం మంగళవారం నుంచి పూరీలో 233 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరోవైపు, రథయాత్రకు సన్నద్ధతపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రివ్యూ మీటింగ్ నిర్వహించి, భక్తుల భద్రత, సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. వర్షం కారంగా నీరు నిలిచిపోవడం ఒక ప్రధాన సవాలుగా మారడంతో, పూరీ జిల్లా యంత్రాంగం, పురపాలక అధికారులు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని, నీటిని తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రథయాత్ర కోసం పూరీలో 19 మంది ఐపీఎస్ అధికారులు, దాదాపు 13,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించి, బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు.

# వైసీపీ కార్యకర్తల కోసం సూపర్ యాప్

అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధికారిక జగన్ 2.0 సూపర్ యాప్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఇతర సామాజిక మాధ్యమాల్లో వైసీపీ కార్యకర్తల కంటెంట్‌ను అణచివేస్తున్నారన్న కారణంగా , ఎవరూ అడ్డుకోలేని విధంగా సొంత ప్లాట్‌ఫామ్‌ను రూపొందించుకోవడం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ యాప్ ఆవిష్కరణ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సోషల్ మీడియా వేదికల్లో తమ పార్టీ శ్రేణులు పోస్ట్ చేస్తున్న కంటెంట్‌ను కుట్రపూరితంగా డిలీట్ చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ కుట్రలను తిప్పికొట్టడానికే జగన్ 2.ఓ సూపర్ యాప్ ను తీసుకువచ్చినట్లు ప్రకటించారు. ఇది పూర్తి స్థాయిలో పార్టీకి చెందిన సొంత యాప్ కావడం వల్ల, ఇందులో కార్యకర్తలు తమ అభిప్రాయాలను ఎటువంటి భయం లేకుండా నిర్భయంగా పంచుకోవచ్చని, బయటి వ్యక్తులు ఎవరు పడితే వారు కంటెంట్‌ను డిలీట్ చేసే హక్కు ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ సూపర్ యాప్ ద్వారా పార్టీలోని క్షేత్రస్థాయి చిన్న కార్యకర్త మొదలుకుని తాడేపల్లి కేంద్ర కార్యాలయం వరకు ప్రతి ఒక్కరూ నిరంతరం అనుసంధానమై ఉంటారని జగన్ వివరించారు. గ్రామం, నియోజకవర్గ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నేతల వరకు అందరూ ఒకే వేదికపైకి రావడం వల్ల సమన్వయం సులువవుతుందన్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలతో పాటు, రాజకీయ ప్రత్యర్థులు లేదా పోలీసుల వేధింపుల వల్ల ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలు ఈ యాప్ ద్వారా నేరుగా పార్టీ నాయకత్వంతో టచ్‌లో ఉండే అద్భుత అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలకు భరోసా కల్పించేలా ఈ యాప్‌లో మరికొన్ని ప్రత్యేక ఫీచర్లను పొందుపరిచారు. పార్టీ నిర్వహించే ప్రతి సమావేశం, ప్రెస్ మీట్లు, ముఖ్యమైన అధికారిక ప్రకటనలు లైవ్ ఫీడ్ ద్వారా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే, ప్రస్తుతం వైసీపీ నిర్వహిస్తున్న డిజిటల్ డైరీ ని కూడా ఈ యాప్‌తో అనుసంధానం చేశారు. దీనివల్ల వేధింపులకు గురవుతున్న కార్యకర్తలు నేరుగా యాప్ ద్వారానే డిజిటల్ డైరీలో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని, బాధితులకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ అండగా నిలబడతాయని జగన్ భరోసా ఇచ్చారు. ఇతర సోషల్ మీడియా వేదికల్లో వైఎస్సార్‌సీపీపై జరుగుతున్న అనుచిత విమర్శలు, మార్ఫింగ్ వీడియోలపై చట్టపరమైన ఫిర్యాదులు చేస్తూనే మరోవైపు పార్టీని డిజిటల్ పరంగా స్వావలంబన వైపు నడిపించేందుకు ఈ సొంత ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుందని జగన్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ యాప్‌ను సాంకేతికంగా మరింత అభివృద్ధి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ చారిత్రాత్మక డిజిటల్ అడుగు ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే రోజుల్లో తన సోషల్ మీడియా ఉనికిని మరింత శక్తివంతంగా మార్చుకోబోతోందని భావిస్తున్నారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.?

తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు–2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు

**శ్రీశైలం** లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురు వారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాదికార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది.

ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది.
నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# హిందూ విద్యార్థితో కల్మా చదవాలని ఒత్తిడి

## – సైదాబాద్లో ఉద్రిక్తత

**హైదరాబాద్** హైదరాబాద్:– పాతబస్తీ పరిధిలోని సైదాబాద్లో ఉన్న సక్సెస్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థితో కల్మా చదవాలని పాఠశాల యాజమాన్యం ఆదేశించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు.

తమ పిల్లల మత విశ్వాసాలకు విరుద్ధంగా ఎలాంటి ప్రార్థనలు లేదా మతపరమైన పాఠాలు బలవంతంగా చెప్పించడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని సిబ్బంది తీరు పట్ల విద్యార్థి కన్నీరు పెడుతు ఇంటికి రావడంతో తల్లితండ్రులు గమనించి అడగగా అసలు విషయం వెలుగులోకి రావడం జరిగింది..
ఈ ఘటనపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, ఆరోపణలు నిజమైతే పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు. హిందూ సంఘాలు స్కూలు ముందు అందోళన చెపట్టాయి. స్కూలు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేసాయి. పరిస్థితులు ఉద్రిక్తతంగా మారడంతో పోలీసులు అందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

# వెల్కటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట** ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతి రోజు క్రమం తప్పకుండా చదవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్పాఠశాల ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. మైదానంలో చెట్లు ప్రశాంతమైన వాతావరణం బాగుందని ప్రిన్సిపల్ ను అభినందించారు. పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అన్ని సబ్జెక్ట్స్ తరగతులు అవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బాగుందా అని అడగ్గా అన్ని తరగతులు బాగానే అవుతున్నాయని భోజనం బాగుందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు. గోడపైన రాయించిన తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ టెన్సెస్, గణిత సుత్రాలు, సైన్స్ సుత్రాలను చూపిస్తూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు.

గోడపైన రాసినవి రోజు చూస్తుంటే వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా జ్ఞాపకం ఉంటాయని, రోజు ఒకసారి వాటిని తప్పనిసరిగా చదవాలని తెలిపారు. సబ్జెక్టులో ఏదైతే రాదన్న టాపిక్ పలు మార్లు చదివితే రానీదంటూ ఏదీ ఉండదని, సమయాన్ని వృధా చేయవద్దని పుస్తక జ్ఞానంతో పాటు రోజు న్యూస్ పేపర్ చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పెండింగ్ ఉంచకుండా అదే రోజు చదవాలని, మంచి క్రమశిక్షణతో కూడిన అలవాట్లను అలవర్చుకోవాలని, సబ్జెక్టుకు సంబంధించి ఏలాంటి డౌట్స్ ఉన్నా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని, భయపడుతూ, సార్ ఏమంటారో, అని వెనకడుగు వేయకూడదని, ధైర్యంగా తెలపాలని జీవితంలో ఏ రంగం ఎంచుకున్న దృఢంగా నిలబడినాలని తెలిపారు. పదవ తరగతి అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ఇక్కడ బాగా చదివి అందరూ ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులు కావాలని, మీకు మీ పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.

# పాలభిషేకాలు, జేసీబీ గజమాలలు బంద్

కార్యక్రమాల్లోనైనా, ఏ వేదికపైనైనా సరే పాలతో అభిషేకాలు, నీటితో అభిషేకాలు చేయడాన్ని ఖచ్చితంగా నిలిపివేయాలని ఆదేశించారు. సమాజంలో ఎంతో మంది పోషకాహార లోపం ఎదుర్కొంటున్న తరుణంలో, ఇలా పాలను వృధా చేయడం భావ్యం కాదని టీపీసీసీ ఈ లేఖలో తీవ్రంగా ఆక్షేపించింది. పాలాభిషేకాలు వంటి వృధా పనులకు బదులుగా, పేదలకు, అవసరమున్న వారికి ఆహార పదార్థాలను పంపిణీ చేసే సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేసింది. దీనివల్ల సమాజానికి మేలు జరగడమే కాకుండా పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతుందని అభిప్రాయపడింది. ఇక ఇటీవల కాలంలో రాజకీయ సభల్లో పెచ్చుమీరిపోయిన జేసీబీ సంస్కృతిపై కూడా కాంగ్రెస్ పార్టీ ఉక్కుపాదం మోపింది. సీనియర్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించే సమయంలో కొందరు నాయకులు తమ అతి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ జేసీబీలు, బుల్డోజర్లు , ఇతర భారీ యంత్రాలను ఉపయోగించి భారీ దండలు వేస్తున్నట్లు పార్టీ గుర్తించింది. బుల్డోజర్లు, జేసీబీలు వంటి వాహనాలు అణచివేతకు చిహ్నాలని, అందుకే అలాంటి వాటిని కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించదని స్పష్టం చేస్తూ.. ఈ తరహా ప్రదర్శనలను పూర్తిగా నిషేధించింది. ఒకవేళ ఈ ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా నేతలకు జేసీబీలు, క్రేన్ల ద్వారా గజమాలలు వేయడానికి ప్రయత్నిస్తే, సదరు నాయకులు , కార్యకర్తలపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని టీపీసీసీ గట్టిగా హెచ్చరించింది. ఈ సర్క్యులర్ కాపీలను రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ అనుబంధ విభాగాలు, సెల్స్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులందరికీ పంపిస్తూ, క్షేత్రస్థాయిలో ఈ నియమాలు ఖచ్చితంగా అమలు అయ్యేలా చూడాలని ఆదేశించింది.

# సీతారామ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేస్తాం

తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి భట్టి విక్రమార్క క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క వివరించారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించే విధంగా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500--8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### పెండింగ్ ప్రాజెక్టులు దశలవారిగా పూర్తిచేస్తాం

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లుగా ఉత్తమ్ వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ, కేంద్ర జల సంఘం సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు.

# మద్యం ధరల పెంపు

అందిన ప్రతిపాదనల పైన ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరల కమిటీ నేడు సమావేశం అయి చర్చించనుంది. ధరల పైన తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ కమిటీ ఇప్పటికే మద్యం తయారీ సంస్థలు, డిస్టిలరీల ప్రతినిధులతో సమావేశం అయి వారి అభిప్రాయాలు సేకరించింది. మద్యం తయారీ కంపెనీలు ఇప్పటికే ఉత్పత్తి వ్యయం, ముడి పదార్థాల ధరలు, రవాణా ఖర్చులు, పన్నుల ప్రభావం వంటి కారణాలతో ధరలు పెంచాలని కోరుతున్నాయి. గాజు సీసాలు, ప్యాకేజింగ్ సామగ్రి, స్పిరిట్ ధరలు, కార్మిక వ్యయాలు,రవాణా ఖర్చులు గణనీయంగా పెరిగాయని,ప్రస్తుతం అమల్లో ఉన్న ధరలతో వ్యాపారం కొనసాగించడం కష్టసాధ్యంగా మారిందని తయారీ సంస్థలు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు.

కాగా నేడు జరిగే సమావేశంలో మద్యం ధరలను ఎంత మేర పెంచాలి, ఏయే బ్రాండ్లపై ఎంత మేర ధరల సవరణ ఉండాలి, కొత్త ధరలను ఎప్పటి నుంచి అమలు చేయాలి వంటి అంశాలపై చర్చించనున్నారు. అయితే ప్రీమియం, మిడిల్, ఎకానమీ విభాగాలకు చెందిన బ్రాండ్లకు వేర్వేరుగా ధరలు నిర్ణయించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు మద్యం ధరలు 10–20 శాతం మేర పెంచే అవకాశం ఉంది. అదే విధంగా ధరల సవరణతో పాటు మద్యం బాటిళ్ల పరిమాణాల్లో మార్పులు తీసుకురావాలనే ప్రతిపాదన కూడా కమిటీ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న బాటిళ్లతో పాటు 150 మిల్లీలీటర్ల (150 ఎంఎల్) కొత్త సైజు బాటిళ్లను ప్రవేశపెట్టాలని కొన్ని మద్యం తయారీ సంస్థలు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. ప్రభుత్వానికి అందిన ప్రతిపాదనలకు కమిటీ ఆమోద ముద్ర వేస్తే ప్రస్తుతం విక్రయిస్తున్న బాటిళ్లతో పాటు 150 ఎంఎల్ బాటిళ్లు కూడా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా ఏ బ్రాండ్ కు ఎంత మేర పెంచాలనేది ఈ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నేడు జరిగే ధరల నిర్ణయ కమిటీ సమావేశం లో తీసుకొనే నిర్ణయాల ఆధారంగా ప్రభుత్వం అధికారికంగా మద్యం ధరల పైన నిర్ణయం ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు.

అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

# నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల

ఫలితాల విడుదలకు కొన్ని గంటల ముందు రీ–ఎగ్జామ్‌కు సంబంధించిన తుది ఆన్సర్ కీని కూడా ఎన్టీఏ విడుదల చేసింది. అర్హత సాధించిన వారిలో 58 శాతానికి పైగా మహిళా అభ్యర్థులే ఉన్నారని ఎన్టీఏ తెలిపింది.

టాపర్లలో అత్యధికులు 17 నుంచి 19 ఏళ్ల వయసు వారే ఉన్నారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడుతో పాటు తెలంగాణ నుంచి కూడా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఫలితాలను సకాలంలో ప్రకటించడం వల్ల మెడికల్ అడ్మిషన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సజావుగా కొనసాగించడానికి వీలవుతుందని ఎన్టీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల సౌలభ్యం కోసం స్కాన్ చేసిన ఓఎంఆర్ షీట్లు, స్కోర్‌కార్డులను డిజిలాకర్‌లో కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

## బాధితులకు కొండంత అండ 'సీఎంఆర్ఎఫ్'

**- రూ.15.26 లక్షల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అమిలినేని**

**కళ్యాణదుర్గం:**ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (అఓఖీఈ) కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం స్థానిక ప్రజావేదిక నందు 23 మంది అనారోగ్య బాధితులకు రూ. 15,26,220 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను పూర్తిగా విస్మరించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం తక్షణమే నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు.

## ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తాం

**- ఎమ్మెల్యే అమిలినేని - ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, అధికారులు**

**కళ్యాణదుర్గ్** గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించకుండా మరిన్ని సమస్యలు ప్రజలపై మోపి వెళ్లిపోయిందని, వాటిని త్వరగా పరిష్కరించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. ఈ మేరకు నేడు కళ్యాణదుర్గం లోని ప్రజావేదిక నందు ప్రజాదర్బార్ (గ్రీవెన్స్) నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ఆర్‌డీఓ వసంత్ బాబు, డీఎస్పీ రవి బాబు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల గురించి వివరాలు తెలుసుకొని సంబంధిత అధికారులతో చర్చించి చాలా వరకు అక్కడికక్కడే పరిష్కారం చేశారు.?? ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ప్రజాదర్బార్‌లు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మనుమడు ప్రియాన్ష్

**- ప్రియాన్ష్ ను అభినందించిన కుటుంబ సభ్యులు.**







**తుగ్గలి:** ఉమ్మడి జిల్లాల గ్రంధాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మనుమడు ప్రియాన్ష్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నాడు. మండల కేంద్రమైన తుగ్గలికు చెందిన కుమ్మరి మణికంఠ, పావని దంపతుల కుమారుడు కుమ్మరి ప్రియాన్ష్ (వయస్సు 4 సంవత్సరాల 6 నెలలు) వయస్సులోనే "ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్" లో ఘనత సాధించాడు. కుమ్మరి ప్రియాన్ష్ కేవలం 4.6 సంవత్సరాల వయస్సులో 5 వేర్వేరు 35(మొత్తం 175 ముక్కల) జిగ్సా పజిల్స్ విజయవంతంగా పూర్తి చేసి ఈ రికార్డును సాధించాడు. ఈ ఘనతను గుర్తిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ కుమ్మరి ప్రియాన్ష్ "ఐబీఆర్ అచీవర్" టైటిల్‌తో పాటు సర్టిఫికెట్,మెడల్, ఐడీ కార్డ్,పుస్తకాన్ని అందించింది. ప్రియాన్ష్ తల్లిదండ్రులు తుగ్గలి మణికంఠ,పావని లు ఈ విజయానికి కారణమైన గురువులకు, కుటుంబ సభ్యులకు మరియు శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కుటుంబ సభ్యులందరూ కుమ్మరి ప్రియాన్ష్ కు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. అదేవిధంగా మండల పరిధిలోని గల పలువురు ప్రజలు ప్రియన్ష్ ప్రతిభను కొనియాడారు.

## వర్షం కోసం రెండవ రోజు ముస్లిం సోదరులు ప్రత్యేక ఫాతెహాలు



**కౌతాళం** : మానవాళికి అత్యంత సన్నిహితమైన ఆహారం ఏదైనా ఉంది అంటే అది మంచినీళ్లు అని ఆఫీస్ సబ్ తెలిపారు. ముస్లిమ్స్ ఆధ్వర్యంలో గురువారం రెండవ రోజున వర్షం కోసం ప్రత్యేక ఫాతిహాలు ప్రార్థనలు జరిపారు. వారు మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావముల వర్షపాతం అతి తక్కువగా ఉండటంతో వేసిన పంటలు ఎండు ముఖం పెట్టడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కళ్ళముందే ఆవిరివుతుంటే. అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మానవ మనుగడకు ఒక పూట అన్నం లేక పోయిన పర్వాలేదు మంచినీళు ప్రతి అరగంటకు అందరికీ కావలసిందేనని మానవ సృష్టిలో చెట్టు. చీమ మూగజీవగలకు. సైతం నీరు ఎంతో అవసరమని తెలిపారు. సకాలంలో వర్షాలు బాగాపడి రైతుల ముఖాల్లో ఆనందం విల్లు విరియాలని వారు పెట్టిన పెట్టుబడులు అధికంగా లాభాలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జామియా మసిద్, నురాని,మసిద్,మదీనా మసీద్ ముస్లిం సోదరులు ఎక్కువ సంఖ్యలు ప్రత్యేక ఫాతిహాలు ప్రార్థనలు జరిపారు.

## "మీ భద్రత మీ చేతిలోనే"...

**- తుగ్గలి ఎస్సై నరేష్**

**- తుగ్గలి కస్తూరిబా పాఠశాలలో అవగాహన సదస్సు.**



**తుగ్గలి:** మీ భద్రత మీ చేతులలోనే ఉంటుందని తుగ్గలి ఎస్సై నరేష్ తెలియజేశారు. మండల కేంద్రమైన తుగ్గలిలో గల స్థానిక కస్తూరిబా పాఠశాల యందు గురువారం రోజున తుగ్గలి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు తుగ్గలి ఎస్సై నరేష్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తుగ్గలి ఎస్సై నరేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అదేవిధంగా మహిళల భద్రతకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే 100,181 మరియు 112 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ నుండి వచ్చే ఐవిఆర్ఎస్ కాల్స్ యొక్క ఉద్దేశ్యం మరియు వాటికి ఎలా స్పందించాలో వివరించారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అపరిచితుల నుండి వచ్చే లింకులు,ఓటిపి లు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఉంటే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. చిన్నారులు తమ శరీర భద్రత గురించి తెలుసుకోవాలని,ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు చెప్పాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్ఓ షాహిన్,కేజీబీవీ పాఠశాల బోధనా సిబ్బంది,తుగ్గలి పోలీస్ సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వై.ఎస్. జగన్ 'సీమ' క్యాన్సర్ గడ్డ కాదు

- జగన్ దే ఎప్పటికీ రాయలసీమ అడ్డా.
- పోతారెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వై.ఎస్ పెంచకపోతే 'సీమ' ప్రాజెక్ట్ ల గతి ఏమిటి?
- నాడు వై.ఎస్. ఉద్యమించడంతోనే ఎన్టీఆర్ 'సీమ' ప్రాజెక్టులకు రూపకల్పన.
- వై.ఎస్... వై.ఎస్.జగన్ లను లోకేష్ విమర్శించడం అవగాహనా రాహిత్యమే.
- మంత్రి నారా లోకేష్ పై వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం ఫైర్.




**కడప** వై.ఎస్.జగన్ రాయలసీమకు పుట్టిన క్యాన్సర్ గడ్డ లాంటి వాడని వైయస్సార్ కడప జిల్లా పర్యటనలో టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్,ఐ.టి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసందర్భ ప్రేలాపనలు చేయడం సిగ్గు చేటని, రాయలసీమ అభివృద్ధిని కాంక్షించి,ప్రాజెక్టులను పరుగులు పెట్టించిన అపర భగరదుడు వైయస్ జగన్ దే ఎప్పటికీ రాయలసీమ అడ్డా అని ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ చరిత్ర లో జగన్ బాహుబలి అయినందునే చంద్రబాబు, లోకేష్ లు జగన్ పేరు ఎత్తకుండా మాట్లాడే పరిస్థితి లేదని దీనిని బట్టి జగన్ అంటే వారికి ఎంత భయమో స్పష్టమౌవుతుందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి, కనులాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి విస్పష్టంగా ప్రకటించారు. కడప నగరంలో వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యాల యంలో గురువారం ఉదయం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ డా॥ వై.ఎస్.రాజ శేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచాలనుకున్నప్పుడు తెలంగాణా కాంగ్రెస్ అగ్ర నేతలు పి.జనార్ధనారెడ్డి,మర్రి శశిధర్ రెడ్డి లాంటి నేతలు సొంతపార్టీలో ఉద్యమిస్తే వాటిని లెక్క చేయకుండా పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుండి 44 వేలక్యూసెక్కులకు పెంచిన దీశాలి డా॥ వై.ఎస్ అని ఆయని కొనియాడారు. కానీ... దానిని వ్యతిరేకిస్తూ, నిరసిస్తూ కోస్తాలో ప్రకాశం బ్యారేజీపై టీడిపి నేత దేవినేని ఉమా,తెలంగాణ లోని మహబూబ్ నగర్ జిల్లా లో డా॥నాగం జనార్ధన్ రెడ్డి లతో ధర్నాలు చేయించి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చ గొట్టించింది మీ తండ్రి నారా చంద్రబాబు నాయుడు అన్నది జగద్విదితమన్నారు. నాడు డా॥వై.ఎస్ పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచకపోతే రాయలసీమ ప్రాజెక్ట్ ల పరిస్థితి ఏమని ఆయన నిలదీశారు. 1983-1984వ సంవత్సరంలో నాటి పిసిసి చీఫ్ డా॥ వై.ఎస్. రాజ శేఖర్ రెడ్డి నాయకత్వం లో పోతిరెడ్డిపాడు కరువుబండ యాత్ర పెద్ద ఎత్తున చేపట్టడంతోనే రాయలసీమ కరువు పరిస్థితులు తెలుసుకుని, పరిస్థితులను గమనించి బేషజాలకు,అహంకారానికి పోకుండా నాటి ముఖ్యమంత్రి డా॥ నందమూరి తారక రామారావు రాయలసీమ ప్రాజెక్టులను ప్రకటించారని ఆయన స్పష్టం చేశారు. డా॥వై.ఎస్,వై.ఎస్. జగన్ లు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు రాయలసీమ ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించి ప్రాజెక్ట్ పనులను పరుగులు పెట్టించి ఉండక పోతే రాయలసీమ కు నీరు వచ్చేవా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తండ్రి, కొడుకులు,వై.ఎస్, వై.ఎస్ జగన్ లు ముఖ్యమంత్రులు గా ఉండి రాయలసీమకు నీళ్ళు తెచ్చుకోలేకపోయారనటం మొగుణ్ణి కొట్టి మొగ సాల ఎక్కినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. తెలుగుగంగ, గాలేరు - నగరి, ఎస్సార్ బి.సి ఆయకట్టు రైతుల ప్రయోజ నాలను పరిరక్షించడంతోపాటు, రాయలసీమ, నెల్లూరు జిల్లాల దాహార్తిని తీర్చడం కోసం శ్రీ శైలంలో 800 అడుగుల నుంచి రోజుకు 3 టి.యం సి ల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా దిగువన కాలువలోకి ఎత్తి పోసేలా వై.ఎస్.జగన్ రాయల సీమ ఎత్తి పోతల చేపట్టటం' సీమ ' పట్ల ఆయన కున్న చిత్త శుద్ధి కి నిదర్శనమని ఆయన కొనియాడారు. కానీ... వై.ఎస్. జగన్ చేపట్టిన ఎత్తిపోతలను కూటమి నేతలు వ్యతిరేకించడం సిగ్గుచేటుని, 'సీమ'ను గురించి మాట్లాడే నైతిక హక్కు లోకేష్ లేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో కుదిరిన చీకటి ఒప్పందనీతోనే 'సీమ' ఎత్తి పోతలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆపివేశారని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం తో వారి ' సీమ' వ్యతిరేకత బహిర్గత మైందని ఆయన ధ్వజమెత్తారు. కర్నాటకలో ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచినా, అప్పర్ భద్ర అనుమతులను చంద్రబాబు అడ్డుకోకపోవడంతో తుంగభద్ర డ్యాంపై ఆధార పడ్డ హెచ్చెల్సీ,ఎల్లెల్సీ, కె.సి. కాలువ ల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకమైంది వాస్తవం కాదా? అని ఆయన నిలదీశారు. వాస్తవా లను వక్రీకరిస్తూ,వై.ఎస్, వై.ఎస్. జగన్ ల పై విషం చిమ్మడం చంద్రబాబు,లోకేష్ కు పరిపాటిగా మారిందని ఆయన నిశితంగా విమర్శించారు.'సీమ' రైతాంగాన్ని సర్వనాశనం చేసి, నీతులు చెప్పడం వై.ఎస్, వై.ఎస్ జగన్ పై విషం చిమ్మడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. చంద్రబాబు, లోకేష్ లకు 'సీమ' రైతాంగం,ప్రజలు తగిన సమయం లో బుద్ధి చెప్పడం ఖాయమని రెడ్యం తీవ్రంగా హెచ్చరించారు.

## సీసీ కుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ జానకి

**- పోలీస్ స్టేషన్ పనితీరుపై సమీక్ష, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని సూచన**



**మహబూబ్‌నగర్** సీసీ కుంట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి, ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు స్థితి, గ్రేవ్ కేసుల విచారణ, నాన్-గ్రేవ్ కేసుల పరిష్కారం, వారెంట్ల అమలు, పెండింగ్ పిటిషన్లు, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసును వేగవంతంగా, నాణ్యమైన దర్యాప్తుతో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామాల వారీగా అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, ఆర్థిక మోసాల బారిన పడకుండా గ్రామస్థులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి సత్వర సేవలు అందించాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఎస్పీ గారు తెలిపారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణను కూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి నేరస్థులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని, ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరిగేలా సేవలందించాలని సీసీ కుంట ఎస్ఐకి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కుంట ఎస్ఐ ఓబుల్ రెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగొండ లక్ష్మి నరసిహస్వామి ఆలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పూజలు



**కొడిమ్యాల** కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని కేంద్ర మంత్రి బండి సంజమయ్ కుమార్ గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తరువాత వేదపండితులు ఆశీర్వచదించి స్వామివారి ప్రసాదం అందజేశారు. జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు కలుగుతున్న పలు ఇబ్బందుల గురించి వారు వివరించగా వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు గుట్ట మీది దేవాలయం వద్ద లైటింగ్ ఏర్పాటు, ఘాట్ రోడ్డును అభివృద్ధి చేసే విషయంలో నా వంతు సాయం చేస్తానని వేదపండితులకు, అధికారులకు మంత్రి హామీ ఇచ్చారు.

## రాజధాని ప్రాంతంలో మంత్రులు నారాయణ, నిమ్మల పర్యటన

**అమరావతి** గురువారం నాడు రాజధాని ప్రాంతంలో మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు,టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ పర్యటించారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న టవర్లను పరిశీలించారు. నిర్మాణాలు దాదాపు పూర్తి కావడంతో త్వరలోనే ప్రభుత్వానికి అప్పగిస్తామని తెలిపారు. నిర్మాణంలో తీసుకున్న జాగ్రత్తలను మంత్రి,ఎమ్మెల్యే లకు మంత్రి నారాయణ వివరించారు. మంత్రి మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ లు ఇక్కడకు వచ్చి నివాసం ఉంటారు. అమరావతి నిర్మాణం అనుకున్న విధంగా పూర్తవుతుంది. సీఎం చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్ కు,బిజెపి నాయకత్వానికి ధన్యవాదాలని అన్నారుజ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పిచ్చి తుగ్లక్ సైతం, అసూయ, ఆశ్చర్య పోయేలా అమరావతి పై గొడ్డలి పార్టీ నాయకుడు మాట్లాడుతున్నాడు. జగన్ మావిగన్ అంటే, సజ్జల విజయవాడ అని, పెద్దిరెడ్డి 30 రాజధానులు అంటూ రోజుకో మాట, పేటకో మాట మాట్లాడుతున్నారు. నాడు అమరావతి, మొన్న 3 రాజధానులు, నేడు మావిగన్ అంటూ స్థిరం లేని వ్యక్తి జగన్. కర్ణాటకకు బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణాకు హైదరాబాద్ నుండి 70 శాతం ఆదాయం అందిస్తున్నట్లే, ఆంధ్రప్రదేశ్ కు అమరావతి ఆదాయం ఇస్తుంది. అమరావతి రాజధాని వైఖరిలో జగన్ తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుంది. అమరావతి కాదు మూడు ముక్కలంటూ, అయిదేళ్ళ కాలంలో మూడు ఇటుక ముక్కలు కూడా పెట్టలేదు. సచివాలయం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సుమారు 16,000 మంది ఒకేచోట పని చేసే విధంగా 5 ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారు. ప్రపంచం లోనే అత్యంత పొడవైన సెక్రటేరియట్ భవనంగా 204 మీటర్లు ఎత్తుతో నిర్మిస్తున్నారు. దేశంలోనే సచివాలయం, హెచ్ఓడి టవర్లు ఒకే చోట మెదటి సారిగా నిర్మిస్తున్నది మన రాష్ట్రంలోనే. దేశంలోనే మొదటి డయా గ్రిడ్ బిల్డింగ్, లోపల ఎటువంటి పిల్లర్లు, లేకుండా, తుఫాన్ లు, వంటి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునేలా నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లకు 12 టవర్లలో 276 ఫ్లాట్స్ 90 శాతం నిర్మాణం పూర్తయ్యాయు. అల్ ఇండియా సర్వీస్ అధికారులకు 6 టవర్ల తో 138 ఫ్లాట్స్ 95 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయు. చంద్రబాబు నాయకత్వం లో ప్రపంచ స్థాయిలో ప్రజా రాజధాని నిర్మిస్తున్నాం. సీడ్ యాక్సెస్ రోడ్ కోసం మొత్తం 45.47 ఎకరాలకు గాను, 99. 5 శాతం మంది రైతులు నుండి భూమిని సమీకరించాం ఇంకా కేవలం 1.52 ఎకరాలు మాత్రమే భూ సమీకరణ ద్వారా రావలసి ఉంది. కేవలం ఒకరో, ఇద్దరో రైతులు రాజకీయ దురుదేశ్యం తో భూములు ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని అన్నారు.

## సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా కొండూరు ఎస్టీ కాలనీలో ప్రజల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళన




**బద్వేలు** కడప జిల్లా, బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలం, కొండూరు ఎస్టీ కాలనీతో పాటు దళితుల గ్రామాలలో సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించి గ్రామ ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అట్లూరు మండల కార్యదర్శి ఇ. రమణయ్య మాట్లాడుతూ? స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులు, గిరిజనులు నివసించే కాలనీల్లో కనీస మౌలిక వసతులు కూడా కల్పించకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. రహదారులు, కాలువలు, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు అడుగడుగునా అవినీతి, నిర్లక్ష్యం, అలసత్వంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండల సర్వసభ్య సమావేశాలలో ఎన్నిసార్లు ఈ సమస్యలను ప్రస్తావించినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ప్రజల సంక్షేమం కంటే కాగితాలపై నివేదికలు చూపించడానికే పరిమితమవుతున్నారని అన్నారు. దళితులు, గిరిజనులకు కేటాయించిన స్మశాన వాటికలను కూడా కొందరురాజకీయ నాయకులు మామిడి తోటలో వేసి కంచెలు నాటి స్మశానం లేకుండా ఆక్రమించుకోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. మృతదేహాలకు చివరి సంస్కారాలు నిర్వహించడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. స్మశాన వాటికల ఆక్రమణలను వెంటనే తొలగించి, వాటికి హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాలనీల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, అర్హులందరికీ గృహ పట్టాలు, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అట్లూరు మండల దళిత ప్రజలకి ప్రభుత్వ భూమి 100 ఎకరాలు ఉన్న రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వడానికి ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు అదేవిధంగా రాజకీయ నాయకులు వేల ఎకరాలు ఆక్రమించుకున్న అనేకాంతం అవుతున్న పట్టించుకోవడం లేదు, నిరుపేదలు కనీసం రెండు ఎకరాలు సాగు చేసుకున్న వారిపై కేసులు పెట్టి ప్రభుత్వాలు భయాందోళనకి గురి చేస్తున్నారు,ప్రజలు ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను సమీకరించి మండల కార్యాలయం ఎదుట ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ప్రతి దళిత, గిరిజన కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని . ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.స్వప్న, పి.సరస్వతి, వై తిరుపాల్ రెడ్డి, బత్తల బాలయ్య, వెన్నబడి కొండయ్య, కావేటి సంటయ్య, వెన్నబడి గంగమ్మ, ఆదిలక్ష్మమ్మ , వెన్నబడి మల్లెం కొండయ్య, తదితరులు పాల్గొన్నారు

# ఏటూరునాగారంలో అభివృద్ధి శూన్యం.

**బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ మోసమే**
**- సిరికొండ బలరాం**
**గ్యారంటీలు అమలు కాలేదు,**
**హామీలు గాలికే: బీజేపీ ఆగ్రహం.**
**డబల్ ఇంజన్ సర్కార్‌తోనే**
**తెలంగాణ అభివృద్ధి: ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడు.**



ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్) ఏటూరునాగారం మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కూడా అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని, రైతులు, మహిళలు, ఎస్సీ, బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు.ఏటూరునాగారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి సిరికొండ బలరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

### హామీలు అమలు కాలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని ఆయన అన్నారు. మహిళలకు తులం బంగారం, రూ. 2500 ఆర్థిక సహాయం, వడ్డీ లేని రుణాలు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. ఎస్సీలకు ఎస్సీ డిక్లరేషన్ పేరుతో ప్రకటించిన సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని తెలిపారు. రైతు రుణమాఫీ జరగలేదని, పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు సర్వే కూడా చేయలేదని విమర్శించారు. గోదావరి కరకట్ట తూముల రిపేర్లు చేపట్టకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీ కూడా అటకెక్కిందని అన్నారు.

### డబల్ ఇంజన్ సర్కార్ అవసరం.

బీఆర్ఎస్ చేసిన తప్పులనే కాంగ్రెస్ కూడా చేస్తోందని, రెండు పార్టీలు కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని సిరికొండ బలరాం అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో డబల్ ఇంజన్ సర్కార్ ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో జరిగిన అవినీతిని బయటపెడతామని స్పష్టం చేశారు.

### కార్యకర్తలకు పిలుపు.

ఒక బీజేపీ కార్యకర్త వంద మందితో సమానమని, అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని కార్యకర్తలు విశ్వాసంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్య జోహార్ లాల్, మండల ఇన్చార్జి సుధాకర్ రెడ్డి, జాడి రామరాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు కుర్ర సుమలత, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దడిగ వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గాడిచర్ల రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పలక గంగ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీధర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు కర్నే సంపత్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రల్ల ఎల్లయ్య, మండల నాయకులు బొల్లె శీను, మండల ఉపాధ్యక్షులు దుర్గం దుర్గారావు, కందగట్ల రమేష్, అటికే కృష్ణ, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆత్కూరి ప్రేమలత, యువ మోర్చా మండల అధ్యక్షులు బోడ రాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు అటికే నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పడిదల శీను, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఇర్సవడ్ల జగదీష్ కుమార్, సోషల్ మీడియా మండల కన్వీనర్ దుర్గం శ్రావణ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి వినుకొల్లు ధనలక్ష్మి, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కొండకోర్ల రాంబాబు, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు గోరంట్ల వినోద, మార్త మల్లేష్, బూత్ అధ్యక్షులు శివ, సాయి, రఘు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తులకు చేయూతే ప్రభుత్వ లక్ష్యం

**- బోనాలు చేతివృత్తుల మేళా-2026' ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**
**- బీసీ కళాకారులకు మార్కెట్ అవకాశాలు కల్పించడమే ఉద్దేశం**



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో సంప్రదాయ కులవృత్తులను పరిరక్షించి, బీసీ కళాకారులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా గురువారం హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన 'బోనాలు--చేతివృత్తుల మేళా-2026' ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాగూర్, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆలోచనలకు అనుగుణంగా బీసీ కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీ వర్గాలకు చెందిన చేతివృత్తుల కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే వేదికగా ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 16 నుంచి 26 వరకు పది రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు తమ ఉత్పత్తులను ప్రజలకు నేరుగా విక్రయించే అవకాశం కల్పించామని చెప్పారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే అనేక వస్తువులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగంగా ఉన్న కులవృత్తులు కనుమరుగుకాకుండా వాటిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ వృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహిత, ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని చెప్పారు. ప్రజలు సంప్రదాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు ఉపాధి కల్పించడంతో పాటు భావితరాలకు ఈ కళలను అందించే బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్నట్లేనని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మేళాను సందర్శించి బీసీ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి కళాకారులతో ముచ్చటించారు. వారి నైపుణ్యాన్ని అభినందిస్తూ, సంప్రదాయ కళలు, కులవృత్తులను భావితరాలకు అందించే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార వస్తువులు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ వస్త్రాలు, నారాయణపేట చేనేత, నిర్మల్ బొమ్మలు, నిర్మల్ చిత్రకళ, పెంబర్తి ఇత్తడి కళాఖండాలు, వెండి ఫిలిగ్రీ, వరంగల్ దుర్రీలు, సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలు, పూసల కళాఖండాలు, విశ్వకర్మ కళాకారుల ఉత్పత్తులు, విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఏబీసీ కార్పొరేషన్ సీఈఓ అలోక్ కుమార్, బీసీ రెసిడెన్షియల్ సొసైటీ కార్యదర్శి సైదులు, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ హరికృష్ణ, వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

## చెరువును కబళిస్తున్న మట్టి మాఫియా...

**- నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు**
**- తూర్పు గోదావరి జిల్లా, గోకవరం మండలం,**



ప్రభుత్వ ఆస్తిపై కన్నేసిన మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేసి కొత్తపల్లి గ్రామం చివర ఉన్న ప్రభుత్వ చెరువులో యథేచ్ఛగా ఏఅఃలతో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యాలు స్థానికుల కెమెరాకు చిక్కాయి. గత కొన్ని రోజులుగా తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ఏఅః, ట్రాక్టర్లతో వచ్చి చెరువు మట్టిని తవ్వి ట్రాలీలకు ఎక్కించి తరలిస్తున్నారు. ఫోటోల్లో కనిపిస్తున్నట్లుగా యంత్రాలతో పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టిని అమ్ముకుంటున్నారు. పర్యావరణానికి, రైతాంగానికి పెను ప్రమాదంచెరువు మట్టిని ఇష్టానుసారం తవ్వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా దెబ్బతింటుంది. దీనివల్ల రాబోయే వర్షాకాలంలో కొత్తపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరు అందకుండా పోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య కూడా తలెత్తనుంది."చెరువే మా ప్రాణం. దాన్ని నాశనం చేస్తే మా బతుకులు ఏమైపోవాలి? ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల అండతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయి సమాచారంఅధికారుల నిర్లక్ష్యమే కారణమామట్టి అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. గోకవరం రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ శాఖ అధికారుల అలసత్వం వల్లే ఇలాంటి అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులపై వెంటనే కేసులు నమోదు చేసి, ఉపయోగిస్తున్న ఏఅః, వాహనాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువును యథాపూర్వ స్థితికి తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

## బొప్పాయి అమ్మకాలలో
## దళారి వ్యవస్థను రద్దు చేయాలి



**చిట్వేలి** బొప్పాయి అధికంగా పండించే రైల్వే కోడూరు నియోజకవర్గంలో బొప్పాయి అమ్మకాలలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత కోరారు. చిట్వేలి మండలం చెర్లోపల్లి లో బొప్పాయి, మామిడి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కష్టనష్టాలకు ఓర్చి బొప్పాయి పంటను పండిస్తున్నారని అన్నారు. నకిలీ విత్తనాలతో దళారీలు రైతులను బోల్తా కొట్టించి వారి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఢిల్లీ, ముంబాయి, ఇతర ప్రాంతాల నుండి వచ్చే బొప్పాయి వ్యాపారులను నేరుగా రైతుల వద్దకు వెళ్లనీయకుండా కోడూరు లోనే వారికి సకల సదుపాయాలు దళారీలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నేరుగా దళారీలే తమకు నచ్చిన రేటుకు బొప్పాయిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలతో సగం బొప్పాయి చెట్లు కాయకపోవడంతో దిగుబడి రాకపోవడంతో రైతులు సాగు కోసం పెట్టిన ఖర్చుల కోసం నానా అగచాట్లు పడుతున్నారని తెలిపారు. వారం క్రితం కిలో 25 రూపాయలు అమ్మిన బొప్పాయి ప్రస్తుతం దళారీలు రూ. 18 కి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులు పందికాళ్ళ మణి పాల్గొన్నారు.

## ఫిషింగ్ హార్బర్లో బోటు ప్రమాదం

**విశాఖపట్నం** విశాఖ ఫిషింగ్ హార్బర్లో అలల ఉద్ధృతికి బోటు బోల్తాపడి ఏడుగురు మత్స్యకారులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో తాతారావు, ఆకాష్ తీవ్రంగా గాయపడి కేజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4.5 లక్షల ఆస్తి నష్టం జరిగింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత మత్స్యకారులు వేడుకుంటున్నారు.

## నిలుచున్న చోటే ప్రసవం

**- కిందపడిన శిశువుకు గాయాలు**

**భద్రాద్రి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పురిటి నొప్పులతో వచ్చిన మహిళను అక్కడి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో గర్భిణి నిల్చున్న చోటే బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బిడ్డ పుట్టాక కూడా 10 నిమిషాల వరకు వైద్యులు రాలేదని కుటుంబ సభ్యుల ఆరోపణ. ఘటన చూసి ఇతర రోగులు భయాందోళనకు గురైయారు. పోలీసులు విచారణ చేపట్టారు.

## ఎస్ఐఆర్ గడువు పొడగింపును
## వినియోగించుకోవాలి

ఆన్ లైన్ దరఖాస్తు పూర్తి చేస్తే ఎన్యూమరేషన్ ఫామ్ అవసరం లేదు.ఆగస్టు 3 చివరి తేదీ...



అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితారాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూఎఖీ) గడువును మరో పదిరోజులు పొడగించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు గడువును పొడగించటం వల్ల ప్రతీ ఓటర్ తమ ఓటును అప్ డేట్ చేసుకోవాలని కేఎల్ఆర్ సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి ఃఒూలకు ఇవ్వాలని కోరారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారు మ్యానువల్ గా ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపాల్సిన పని లేదని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు 10న ప్రచురించనున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి సెప్టెంబర్ 9 వరకు సవరణలు, కొత్త దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేస్తారని కిచ్చెన్నగారు తెలిపారు. డిజిటలైజేషన్ ఇప్పటి వరకు 50 శాతానికి పైగా పూర్తి అయిందన్నారు. మిగతా ఓటర్లు సైతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి ఇవ్వటం, ఆన్ లైన్ దరఖాస్తులను పూర్తి చేసి ఓటును కాపాడుకోవాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ఃఒం లు ఆగస్టు 3 వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించి... ఃఒూలకు సహకరించాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్న సూచించారు.

## పల్నాడు జిల్లాలో ఆలయంలో చోరీ..

**- హుండీ పగలగొట్టి నగదు అపహరణ..**

నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలోని నూజెండ్లపల్లి అగ్రహారంలో ఉన్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానిక వివరాల ప్రకారం, దుండగులు అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించి, గర్భాలయం సమీపంలో ఉన్న హుండీ తాళాన్ని ధ్వంసం చేశారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు. నగదు తీసుకున్న అనంతరం, ఖాళీ హుండీని సమీపంలోని పొలాల్లో పడేసి పరారయ్యారు.?గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న గ్రామస్థులు హుండీ ధ్వంసమై ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నాదెండ్ల పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గంజాయి రవాణాదారులపై
## రూరల్ పోలీసుల కఠిన చర్యలు

**- పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం కింద నిందితుడి అరెస్ట్**

**చిలకలూరిపేట:** గంజాయి రవాణాపై పల్నాడు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు నేతృత్వంలోని బృందం అక్రమ రవాణాదారులపై నిఘా తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, రెండు అంతకంటే ఎక్కువ కేసులు నమోదై సమాజానికి ముప్పుగా మారిన ముఠా సభ్యులను గుర్తించి, పీఐటీ ఎన్డీపీఎస్ (ఖమి ఔఆఖూ ంఞబి - 1988) చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటోంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కి నిందితుడు ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, గతంలో చల్లా గోపిపై చర్యలు తీసుకున్న పోలీసులు, తాజాగా కారసాని శివప్రసాద్ రెడ్డి (అలియాస్ ప్రసాదరెడ్డి) అనే గంజాయి విక్రయదారుడిని అరెస్ట్ చేశారు. ఇతనిపై నమోదైన నేర చరిత్రను పరిశీలించిన ప్రభుత్వం, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో డిటెన్షన్‌లో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. జులై 15న సీఐ బి. సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని జైలుకు తరలించారు.

## ఆ వార్తలు నిరాధారం

**- మా అబ్బాయి డ్రగ్స్ తీసుకోలేదు - అరెస్ట్ కాలేదు**
**- ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి**

**హైదరాబాద్** మా అబ్బాయి భరత్ రాజ్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్టు.. మంగళ్ హాట్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు జరుగుతున్న ప్రచారం లో వాస్తవం లేదు.

మీడియాలో, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారం.. అవాస్తవమని ఎమ్మెల్సీ వెంకట్రాం రెడ్డి వివరణ ఇచ్చారు. గురువారం ఉదయం మంగళ్ హాట్ పోలీసులు మా ఇంటికి వచ్చి ఒక డ్రగ్స్ కు సంబంధించి కేసు విచారణ జరుపుతున్నామని.. భరత్ రాజ్ రెడ్డి కామన్ ఫ్రెండ్స్ ఫోన్ జాబితాలో తన ఫోన్ నెంబర్ ఉండడంతో అనుమానంతో విచారించాల్సి ఉందని కోరారు. విచారణలో ఈ డ్రగ్స్ కేసు వ్యవహారానికి భరత్ రాజ్ కు ఏ సంబంధం లేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. భరత్ రాజ్ కు చేసిన డ్రగ్స్ టెస్ట్ లో నెగెటీవ్ వచ్చింది. ఈ విషయంలో అనేక అవాస్తవాలు, కల్పిత సమాచారం ప్రచారంలో ఉన్నాయి. నాకుమారుడు ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదు... ఈ కేసులో అరెస్ట్ కాలేదని అన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై అనకాపల్లి పోలీసుల ఉక్కుపాదం

అనకాపల్లి జిల్లాఅనకాపల్లి జిల్లాలో పోలీసులు భారీ గంజాయి అక్రమ రవాణా ముఠాను పట్టుకున్నారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 1.1 కోట్ల విలువైన 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను సీజ్ చేసి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ నగదు బహుమతులతో అభినందించారు.

# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ఎస్.వి.నూకరాజుకు పీహెచ్.డీ



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్ ) దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి శ్రీధరాల వి. నూకరాజును డాక్టరేట్ వరించింది. 'దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం, వాహకం ద్వారా పనిచేసే వినూత్నమైన స్థానిక (టాపికల్) టెరిఫ్లునోమైడ్ ఔషధ రూపాల అభివృద్ధి' అనే శీర్షికతో ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అధ్యాపకుడు డాక్టర్ పవన్ కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ నూకరాజు పరిశోధన, దైహిక దుష్ప్రభావాలను కనిష్ట స్థాయికి తగ్గిస్తూ, ఔషధాన్ని నేరుగా ప్రభావిత ప్రాంతానికి చేరవేసే లక్ష్యంతో, రుమటాయిడ్ ఆర్థరైటిస్, అటోపిక్ డెర్మటైటిస్ చికిత్స కోసం టెరిఫ్లునోమైడ్ యొక్క వినూత్న స్థానిక ఫార్ములేషన్లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిందని తెలియజేశారు. ఈ అధ్యయనం, ఆశాజనకమైన చికిత్సా పనితీరుతో, సురక్షితమైన, లక్షిత, రోగికి అనుకూలమైన చికిత్సా పద్ధతులను అందిస్తూ, వ్యాధి-నిర్దిష్ట స్థానిక ఫార్ములేషన్లను విజయవంతంగా అభివృద్ధి చేసిందన్నారు. ఈ పరిశోధన భవిష్యత్ క్లినికల్ అభివృద్ధి, వాణిజ్యీకరణకు బలమైన సామర్థ్యాన్ని కూడా ప్రదర్శిస్తోందని, తద్వారా స్థానిక ఔషధ పంపిణీ పరిశోధనకు ఒక ముఖ్యమైన తోడ్పాటును అందిస్తుందని వివరించారు.డాక్టర్ నూకరాజు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విశ్వనగరిగా అమరావతి అభివృద్ధి చెందాలని జగన్నాథ స్వామిని ప్రార్థించిన

- ముఖ్యమంత్రి చంద్రబాబు
-అమరావతిలో జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
-బంగారు చీపురుతో రథం ముందు శుభ్రపరిచి సంప్రదాయానికి గౌరవం




అమరావతి(ప్రశ్న న్యూస్) నేటి పరుగుల జీవితంలో పెరుగుతున్న మానసిక ఒత్తిడికి ఆధ్యాత్మికతే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దేవాలయాలు సమాజానికి ప్రశాంతతను, విలువలను అందించే ఆధ్యాత్మిక కేంద్రాలని పేర్కొన్నారు. అమరావతి రాజధానిలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రను గురువారం ఘనంగా ప్రారంభించిన ఆయన, పూరీ సంప్రదాయాన్ని అనుసరిస్తూ రథం ముందు బంగారు చీపురుతో శుభ్రపరిచి, అనంతరం తాడును లాగి రథయాత్రకు శ్రీకారం చుట్టారు.రథయాత్ర ప్రారంభోత్సవ సభలో మాట్లాడిన సీఎం, సమాజంలో మానవ సంబంధాలు క్రమంగా తగ్గిపోతుండటం, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరగడం ఆందోళనకరమని అన్నారు. ఈ పరిస్థితుల కారణంగా కుటుంబ వ్యవస్థ బలహీనపడుతోందని, ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు వంటి సంఘటనలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రతి కుటుంబంలో మానసిక ప్రశాంతత నెలకొనాలంటే ఆధ్యాత్మిక జీవన విధానం అవసరమని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించిన సీఎం, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు బలమైన కుటుంబ బంధాలే భారతీయ సంస్కృతికి మూలం" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అమరావతి బృహత్ మాస్టర్ ప్లాన్ చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, అమరావతి విశ్వనగరిగా అభివృద్ధి చెందాలని జగన్నాథ స్వామిని ప్రార్థించారు. ఈ దృశ్యం రథయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రను ప్రతి ఏడాది అమరావతిలో నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించినట్లు సీఎం తెలిపారు. ఆధ్యాత్మిక సేవతో పాటు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా సుమారు 1.80 లక్షల మంది విద్యార్థులకు ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, విలువల పరిరక్షణలో ఇస్కాన్ వంటి సంస్థలతో ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని తెలిపారు.
జగన్నాథ నామస్మరణలతో మారుమోగిన ఈ రథయాత్రలో కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్నాథ రథయాత్రలో భక్తిరసం

- ఇస్కాన్ ఆధ్వర్యంలో రథోత్సవంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ
- ప్రత్యేక పూజలు భక్తులతో కలిసి రథాన్ని లాగిన గాంధీ



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల నుంచి గోపన్‌పల్లి వరకు ఇస్కాన్ సైబరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర భక్తి పారవశ్యంతో సాగింది. ఈ మహోత్సవంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి శ్రీ జగన్నాథ స్వామి, బలరాముడు, సుభద్రాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే విశిష్ట ఆధ్యాత్మిక ఉత్సవమని అన్నారు. రథయాత్ర సందర్భంగా జగన్నాథ స్వామి ఆలయం నుంచి బయటకు వచ్చి కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరిపై తన కరుణాకటాక్షాలను ప్రసాదిస్తాడనే విశ్వాసం భక్తుల్లో ఉందన్నారు.రథయాత్ర కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, దైవిక ప్రేమకు, భక్తికి ప్రతీక అని పేర్కొన్నారు. జగన్నాథుని రథాన్ని లాగడం అంటే భగవంతుడిని మన జీవితాల్లోకి ఆహ్వానించాలనే పవిత్ర సంకల్పానికి ప్రతీక అని వివరించారు. రథయాత్రలో పాల్గొనే ప్రతి భక్తుడు తన హృదయాన్ని పవిత్రం చేసుకుని కృష్ణ చైతన్యం, ప్రేమపూర్వక భక్తి సేవతో జీవించాలని కోరుకుంటాడని తెలిపారు.భగవంతుడు తన భక్తుల ప్రేమను ఎల్లప్పుడూ స్వీకరిస్తాడనే సందేశాన్ని రథయాత్ర ప్రపంచానికి చాటుతుందని ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగి సంకీర్తనల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, దూబే, అనిల్, ప్రభాకర్ రెడ్డితో పాటు ఇస్కాన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జగన్నాథ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

# ఘట్కేసర్ సర్కిల్లో 'అక్రమ' జోరు

- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- చైన్‌మెన్లదే 'ఆడింది ఆట.. పాడింది పాట' మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి
- అధికారుల తీరుపై స్థానిక ప్రజల తీవ్ర ఆగ్రహం





ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నాగారం డివిజన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, అనుమతులు లేని కమర్షియల్ షెడ్ల నిర్మాణం జోరుగా సాగుతున్నా మున్సిపల్ సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ వ్యవస్థ అసలు ఉందా.? లేదా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## అధికారుల అరకొర హాజరు.. దొరకని దర్శనం

ఘట్కేసర్ సర్కిల్ ఏసీపీ వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని, ఇక టీపీఎస్ శ్రీదేవి వారంలో రెండు మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీగా జనాభా పెరిగి, వేగంగా విస్తరిస్తున్న ఈ ప్రాంతంలో వారం రోజులు పనిచేసినా సమస్యలు తీరవు, అలాంటిది వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే అధికారులు అందుబాటులో ఉండటం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేద్దామని మున్సిపల్ కార్యాలయానికి వస్తే అధికారులు కలవరని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయరని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఒకసారి కలిసినా 'చూస్తాం.. చూస్తాం' అంటూ వారాలు, నెలల తరబడి కాలయాపన చేస్తున్నారే తప్ప ఎలాంటి



చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## చైన్‌మెన్ 'శ్రీనివాస్' హల్‌చల్.. దురుసు ప్రవర్తన

మున్సిపల్ శాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో క్షేత్రస్థాయి సిబ్బంది వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా నాగారం డివిజన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న చైన్‌మెన్ శ్రీనివాస్ తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, అక్రమ నిర్మాణాల విషయంలో కొందరికి ప్రోత్సాహం లభిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిపై ప్రశ్నించిన వారితో "మా ఇష్టం.. మాకు చెప్పడానికి మీరెవరు.? ఏమైనా ఉంటే పైఅధికారులతో మాట్లాడుకోండి, అధికారులు ఏది చెబితే అది చేస్తాం అక్రమ నిర్మాణలకు వాళ్లు నోటీసులు ఇవ్వకుంటే మేమేం చేస్తాం" అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఫోన్ చేసినా స్పందించకపోవడం, కార్యాలయంలో కలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికే గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు రావడంతో కొంతకాలం టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి పక్కన పెట్టినట్లు సమాచారం. అనంతరం యూనియన్ నాయకుల అండదండతో తిరిగి అదే విభాగంలో విధులు అప్పగించినప్పటికీ, ఆయన వ్యవహారశైలిలో అసలు మార్పు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.






ఆయనపై అవినీతి అనేక ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని చెబుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు



స్పందించి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీసి వేరే విభాగానికి బదిలీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ా

## ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

నిబంధనల ప్రకారం మున్సిపల్ శాఖకు చెల్లించాల్సిన ఫీజులు ఎగ్గొట్టి, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, షెడ్ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, నాగారం డివిజన్‌తో పాటు ఘట్కేసర్ సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఏజెన్సీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి: మంత్రి సీతక్క

**ఆగస్టు 15 నుంచి ఒంటరి మహిళలకు కొత్త పింఛన్లు. అర్హుల ఎంపికలో పారదర్శకత తప్పనిసరి**

ఏటూరునాగారం (ప్రశ్న న్యూస్)ఏజెన్సీ ప్రాంతాల్లో పేదల కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ఆగస్టు 15 నుంచి అర్హులైన ఒంటరి మహిళలకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం మండలాల అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టొప్పోతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అర్హుల జాబితాలు సిద్ధం చేయాలి.

సమావేశంలో శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.
మంత్రి సీతక్క మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. గ్రామాల వారీగా అర్హుల జాబితాలను వెంటనే సిద్ధం చేసి, నిర్మాణాలను వేగవంతం చేయాలి. ఎవరికీ అన్యాయం జరగకూడదు" అని స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు.

## ఒంటరి మహిళలకు శుభవార్త

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ఒంటరి మహిళలకు కొత్త పింఛన్లు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. "క్షేత్రస్థాయిలో అర్హుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి పారదర్శకంగా ఎంపిక చేయాలి. అదే సమయంలో మరణించిన పింఛన్ లబ్ధిదారుల పేర్లను వెంటనే తొలగించి, వ్యవస్థను క్రమబద్ధీకరించాలి" అని అధికారులను ఆదేశించారు.



## వైద్యం, విద్య, పరిశుద్ధతకు ప్రాధాన్యం.

ఏజెన్సీ గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు తప్పనిసరి అని పేర్కొన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు సూచించారు.

## నాణ్యత, గడువుపై దృష్టి.

అభివృద్ధి పనులను చేపడుతున్న గుత్తేదారులు నిర్ణీత గడువులోపు, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని మంత్రి హెచ్చరించారు. రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ శాఖ అధికారులు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని, అదే సమయంలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలను కఠినంగా అరికట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ నిబద్ధతను గుర్తుచేస్తూ, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, ఎం. సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పలువురు సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గడువులోనే శంకర విలాస్ బ్రిడ్జి పూర్తి

- నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్
- ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**గుంటూరు(ప్రశ్న న్యూస్)** గుంటూరు నగర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శంకర విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణాన్ని నిర్ణయించిన గడువులోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి స్పష్టం చేశారు. గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్తో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఆమె, అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా వెంటనే పరిష్కరించి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణం పూర్తయిందని, వాటిపై ఏర్పాటు చేయాల్సిన బీమ్స్ తయారీ, అమరిక పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ప్రధాన నిర్మాణంతో పాటు ప్లాట్‌ఫామ్‌ల పనులు కూడా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు.నిర్మాణంలో మెటీరియల్ సరఫరా, కార్మికుల కొరత, సాంకేతిక, పరిపాలనా సమస్యలు ఎదురవుతున్నప్పటికీ సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని అధిగమిస్తూ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. భూసేకరణ అంశాలపై కొందరు కోర్టులను ఆశ్రయించినప్పటికీ, ప్రాజెక్టు పురోగతిపై దాని ప్రభావం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్వీస్ రోడ్లు, అనుబంధ సదుపాయాల నిర్మాణం కూడా సమాంతరంగా కొనసాగుతోందని, ప్రజలకు ఇబ్బందులు తగ్గించేలా పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శంకర విలాస్ బ్రిడ్జి పూర్తయితే



గుంటూరు నగర ట్రాఫిక్ రద్దీకి గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు నగర అభివృద్ధికి ఇది కీలక మౌలిక వసతి ప్రాజెక్టుగా నిలుస్తుందని అన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై జరుగుతున్న అసత్య ప్రచారాలు, అపోహలను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తుండటంతో ప్రాజెక్టు నిర్ణీత గడువులోనే పూర్తవుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# 'ది కాల్' మూవీ రివ్యూ!

హారర్ థ్రిల్లర్ సినిమాలకు ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఎప్పుడూ మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆడియన్స్ చూస్తుంటారు. అందువల్లనే ఈ జోనర్ సినిమాలను ఎక్కువగా వదలడానికి ఓటీటీ సంస్థలు పోటీపడుతూ ఉంటాయి. అలా రూపొందిన సినిమానే 'ది కాల్'. 2020 నవంబర్లో విడుదలైన ఈ సౌత్ కొరియన్ సినిమా, ఆ తరువాత ఓటీటీ సెంటర్లలోకి అడుగుపెట్టింది. అయితే తాజాగా 'జియో హాట్ స్టార్' లో తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 10వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అది సిటీకి దూరంగా ఉన్న ఒక మారుమూల గ్రామం. అక్కడ ఎడిత్ క్రాన్స్ టన్ (లిన్ షేయ్) అనే ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. క్రాన్స్ భర్త ఎక్కువగా ట్రావెలింగ్ లో ఉండటం వలన, ఆమె భయపడుతూనే రోజులు గడుపుతూ ఉంటుంది. ఆమె రూపం.. చిత్రమైన ధోరణి కారణంగా మంత్రగత్తె అనే ఒక పేరు పడిపోతుంది. కొంతమంది ఆకతాయిలు ఆమెను మరింత ఇబ్బందిపెడుతూ ఉంటారు. తన చెల్లెలు 'లారా' కనిపించకపోవడానికి క్రాన్స్ కారణమని 'తానియా' భావిస్తుంది. ఆమెనే లారాను ఏదో చేసి ఉంటుందని ప్రచారం చేస్తుంది. తన స్నేహితులైన క్రిస్ .. బ్రెడ్ .. జాక్ తో కలిసి క్రాన్స్ ఇంటిపైకి వెళుతుంది. రాళ్లు విసురుతూ ఆమె ఇంటి అద్దాలను పగులగొడతారు. ఆ తరువాత ఆమె చనిపోయిందని తెలుసుకుని వాళ్లంతా ఆశ్చర్యపోతారు. ట్రావెలింగ్ నుంచి వచ్చిన క్రాన్స్ భర్త, ఆ నలుగురు స్నేహితులను తన ఇంటికి పిలిపిస్తాడు. తన భార్య ఆత్మ హత్య చేసుకుందనీ, ఆమె బాడీతో పాటు ఫోన్ ను కూడా ఖననం చేశానని చెబుతాడు. తన ఇంట్లోని మేడ పై గదిలోకి ఒక్కొక్కరుగా వెళ్లి, ఆ నెంబర్ కి కాల్ చేసి ఒక నిమిషం మాట్లాడమని కోరతాడు. నిమిషం పాటు మాట్లాడినవారికి, పెద్ద మొత్తంలో నగదు బహుమతిని అందజేస్తానని చెబుతాడు. అలా చేయకపోతే తన భార్య రాసిన సూసైడ్ లెటర్ ను పోలీసులకు అందజేస్తానని బెదిరిస్తాడు. దాంతో అతను చెప్పినట్టుగా చేయడానికి వాళ్లు అంగీకరిస్తారు. ఒక్కొక్కరుగా మేడపైకి వెళతారు. అక్కడ ఏం జరుగుతుంది? వెళ్లినవాళ్లు తిరిగొస్తారా లేదా? అనేది మిగతా కథ.



ఆత్మహత్య చేసుకున్నవాళ్లు దెయ్యాలుగా మారతారా? బ్రతికున్నపుడు తమని అదే పనిగా వేధిస్తూ వచ్చినవాళ్లపై ప్రేతాత్మలు పగబడతాయా? అలాంటివాళ్లపై ప్రతీకారం తీర్చుకుంటాయా? అనే ప్రశ్నలకు సమాధానంగా ఈ సినిమా కథను అల్లుకున్నారు. ఆకతాయి చేష్టలతో తనని వేధించిన ముగ్గురు యువకులు .. ఒక యువతిపై ఒక ప్రేతాత్మ ఎలా ప్రతీకారం తీర్చుకుంటుంది? అనే అంశం చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. వృద్ధురాలు చనిపోవడం .. ఆమె ఆత్మహత్యకు కారకులైన నలుగురు ఫ్రెండ్స్ ను ఆమె భర్త పిలిపించడం .. వాళ్లకి ఒక టాస్క్ ఇవ్వడం వరకూ ఈ కథ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది. ఇక ప్రేతాత్మతో ఫోన్లో మాట్లాడటానికి ఒక్కొక్కరూ మేడపైకి వెళుతుంటే, అసలు కథ మొదలైందనే ఒక కుతూహలం పెరుగుతూ పోతుంది. అయితే ఆ క్యూరియాసిటీ ఎంతోసేపు నిలబడదు. ఎందుకంటే ఆడియన్స్ భయపడేంత స్థాయిలో అక్కడ ఏమీ జరగదు. మేడపైకి వెళ్లిన వాళ్లు ఒక ప్రత్యేకమైన జోన్ లోకి వెళ్లిపోవడం వరకూ బాగానే ఉంది. అయితే అక్కడ లైటింగునుగానీ, ప్రేతాత్మకి సంబంధించిన జుగుప్సాకరమైన సన్నివేశాలనుగాని చూడలేము. భయంతో ముచ్చెమటలు పట్టేంత సీన్ .. అక్కడ ఏ సీన్ కి లేదు. మొబైల్ ను శవంతో పాటు పెట్టేసి పూడ్చేయడం, ఆ నెంబర్ కి కాల్ చేస్తే ప్రేతాత్మ మాట్లాడటం వంటి సన్నివేశాలు చాలా సిల్లీగా అనిపిస్తాయి. సాధారణంగా దెయ్యాల కథలన్నీ దాదాపు ఒక ఇంటిపరిమితమవుతూ ఉంటాయి. ఆ ఇంటి గేటుదాటి దెయ్యాలు బయటికి రావు.

బయట పాత్రలు లోపలికి వెళతాయి అంతే. పైగా ఈ తరహా కథలకు పెద్దగా తారాగణం అవసరం లేదు. చాలా తక్కువ మందితో .. తక్కువ బడ్జెట్ లో కానిచ్చేస్తూ ఉంటారు. అలాంటి ఒక కాన్సెప్ట్ తో రూపొందిన సినిమానే ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే రియాలిటీ షోను గుర్తుకు చేసే కంటెంట్ ఇది. ఆర్టిస్టుల నటన గురించి గొప్పగా చెప్పుకోవడానికేమీ లేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. హారర్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్ కి చాలా సాధారణంగా అనిపించే కాన్సెప్ట్ గా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పచ్చు.

## నిరీక్షణకు తెర 23న వస్తున్న

# 'జన నాయగన్'



తమిళనాడు సీఎం, అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. సెన్సార్ చిక్కుల్లో పడి విడుదల విషయంలో వరుస వాయిదాలు ఎదుర్కొన్న 'జన నాయగన్' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో దళపతి విజయ్ పోలీస్ గెటప్‌లో స్టైలిష్ అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. రాజకీయరంగ ప్రవేశం సమయంలోనే 'జన నాయగన్' తన చివరి చిత్రమని ప్రకటించారు హీరో విజయ్. ఇక తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. విజయ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత విడుదలవుతున్న చిత్రమిదే కావడంతో సామాన్య ప్రజానీకంలో కూడా ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది.

## డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా.. ఒకప్పుడు కూలీ పని కూడా చేశా: విజయ్ సేతుపతి



సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో 'మక్కల్ సెల్వన్' (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని" అని సేతుపతి గుర్తుచేసుకున్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు. నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత దుబాయ్ వెళ్ళి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు. దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ.. 'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత 'సూదు కవ్వమ్', 'విక్రమ్ వేద', 'పిజ్జా', 'మహారాజా' వంటి విలక్షణమైన చిత్రాలతో స్టార్ హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

## తమిళంలో బంపరాఫర్



'కాంతార: ఛాప్టర్ 1' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపును సంపాదించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఆమె యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' వంటి భారీ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిసింది. రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్- ది డెడ్లీ డాక్టర్'లో ఈ భామ కీలక పాత్రకు ఎంపికైందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కథాగమనంలో ఆమె క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. 'ధర్మన్' చిత్రంలో సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా ఇంపార్టెంట్ రోల్‌లో కనిపించనుంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.



## అనకాపల్లిలో జరిగే ప్రేమకథ

విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కాండ్రేగుల నాయుడు, త్రినాథ రావు నక్కిన నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 7న విడుదలకానుంది. ఈ సినిమాలోని 'ఎలగే పిల్ల' అనే పాటను ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ విడుదల చేశారు. దేవ్‌జండ్ సంగీతాన్నందించిన ఈ పాటను అనంత్‌శ్రీరామ్ రచించారు. అనకాపల్లి నేపథ్యంలో నడిచే ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉంటుందని, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవ్‌జండ్, కథ, స్క్రీన్‌ప్లే: త్రినాథరావు నక్కిన, దర్శకత్వం: ఖగేష్ తమ్మినేని.

## నా కెరీర్‌లోనే బెస్ట్ స్క్రీన్‌ప్లే



పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'ఆపరేషన్ అరుణా రెడ్డి'. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, అయేషా ఖాన్ తదితరులు ప్రధాన పాత్రధారులు. ఈ నెల 17న విడుదలకానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ 'నేను పనిచేసిన అన్ని చిత్రాల్లో 'ఆపరేషన్ అరుణారెడ్డి'కి బెస్ట్ స్క్రీన్‌ప్లే ఇచ్చానని చెప్పగలను. ఈ సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా ఈ సినిమాను తెరకెక్కించాం' అన్నారు. ఈ చిత్రానికి మహదేవ్ ఏలెందర్ సంగీతాన్నందించారు.

## నోలన్ 'ది ఒడిస్సీ' సినిమాకు వెళుతున్నారా? అరగంట ముందే థియేటర్‌కు చేరుకోండి!

ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'ది ఒడిస్సీ' చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం (జులై 17) విడుదల కానుంది. అయితే, సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు, మరీ ముఖ్యంగా ఐమ్యాక్స్ స్క్రీన్‌లలో చూసేవారు, కనీసం 30 నిమిషాల ముందే థియేటర్లకు చేరుకోవాలని చిత్ర బృందం సూచించింది. ఈ చిత్రాన్ని సంపూర్ణంగా అధునాతన ఐమ్యాక్స్ కెమెరాలతో చిత్రీకరించారు. ప్రేక్షకులకు అద్భుతమైన దృశ్యానుభూతిని అందించే క్రమంలో, కొన్ని ఎంపిక చేసిన ఐమ్యాక్స్ 70ఎంఎం స్క్రీనింగ్‌లలో ప్రధాన చిత్రం ప్రారంభానికి ముందు ప్రత్యేక కంటెంట్‌ను ప్రదర్శించే అవకాశం ఉంది. దీనిలో భాగంగా, డెనిస్ విల్లేనువే దర్శకత్వంలో రాబోతున్న 'డూన్: పార్ట్ త్రీ' చిత్రానికి సంబంధించిన నాలుగు నిమిషాల ప్రోలోగ్‌ను ప్రదర్శించవచ్చని ప్రచారం జరుగుతోంది. గతంలోనూ నోలన్ తన 'ది డార్క్ నైట్', 'ది డార్క్ నైట్ రైజెస్' చిత్రాల ప్రమోషన్ కోసం ఇదే తరహా వ్యూహాలనే అనుసరించడం గమనార్హం. సాధారణంగా భారీ చిత్రాల విడుదల సమయంలో తలెత్తే ట్రాఫిక్ ఇబ్బందులు, టికెట్ స్కానింగ్ ప్రక్రియ మరియు రద్దీగా ఉండే హాల్స్‌లో సీట్లను వెతుక్కోవడం వంటి కారణాల వల్ల ప్రేక్షకులకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందుగానే థియేటర్‌లకు చేరుకోవడం ఉత్తమమని విశ్లేషకులు సూచిస్తున్నారు. కాగా, ఈ చిత్రాన్ని నోలన్ ఆశించిన పూర్తిస్థాయి ఐమ్యాక్స్ 70ఎంఎం ఫార్మాట్‌లో ప్రదర్శించే థియేటర్లు ప్రపంచవ్యాప్తంగా కేవలం 41 మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభ వారాంతపు టిక్కెట్లు హాట్ కేకుల్లో అమ్ముడయ్యాయి. హోమర్ రచించిన గ్రీకు ఇతిహాసం 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రధాన పాత్ర అయిన ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటించగా, యాన్ హత్వే, టామ్ హాలండ్, జెండాయా వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషించారు. సుమారు 2 గంటల 52 నిమిషాల నిడివి గల ఈ చిత్రంపై, లండన్ ప్రీమియర్ షో అనంతరం అద్భుతమైన సమీక్షలు వెలువడుతున్నాయి. సాంకేతికంగానూ, భావోద్వేగాల పరంగానూ సినిమా అత్యున్నత




స్థాయిలో ఉందంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి.

**సెగ్గం రాజేష్ అధ్వర్యంలో.**



మంథన( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగ పెల్లి గ్రామంలో స్పెషల్. ఇంటెన్సివ్ . రివిజన్ పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పాల్గొని ప్రజలకు వివరంగా చెప్పి ఓటు అనేది బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన గొప్ప ఆయుధమని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరినారు కార్యక్రమం పూర్తి చేసిన సందర్భంగా నాగపల్లి బి ఎల్ ఓ కాసిపేట రాయమల్లు కు శాలువాతో సన్మానం చేయడం చేసినారు కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రావికంటి సతీష్. యువకులు ఊ ట్ల అనిల్ రెడ్డి.పంచిక కుమార్ ఆకాష్ సతీష్ రవి కొమ్మిడి గోవర్ధన్ రెడ్డి. ఉట్ల అక్షిత్ రెడ్డి. మానెం రాజేందర్. గాడేపు బానేష్. మసిరెడ్డి లక్ష్మారెడ్డి. పొట్ల శ్రీకాంత్ ఒడెలు కుమార్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మెదక్ లో పర్యాటక రంగం అభివృద్ధి చెందేందుకు ప్రణాళికలు

**టూరిజం కన్సల్టెంట్ శవంతి గుప్తా, భువన్.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లా కలెక్టర్ మెదక్ జిల్లా గారి ఆదేశానుసారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధి చేయడంలో భాగంగా బుధవారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రముఖ టూరిజం, పర్యాటక విభాగం కన్సల్టెంట్ శవంతి గుప్తా, భువన్ సందర్శించారు.మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి చేయడం, జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటిరోజు జిల్లాలోని నర్సాపూర్ అర్బన్ పార్క్, పార్క్ కాటేజీలు, వెంకట్రావుపేట కోట, మెదక్ ఖిల్లా ప్రాంతాలను సందర్శించడం జరిగింది. జిల్లాలోగల అనేక చారిత్రక ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా (టూరిస్ట్ హబ్‌లుగా) తీర్చిదిద్దేందుకు టూరిజం కన్సల్టెంట్ అధికారులు శవంతి గుప్తా, భువన్ లు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు ఆయా ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులు, చారిత్రక విశిష్టత, పర్యాటకులకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులతో పాటు మరింత అభివృద్ధి చేయాల్సిన అంశాలను వారు పరిశీలించారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక ప్రదేశాల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, వీక్షణ స్థలాలు, పార్కింగ్ సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, దిశా సూచిక బోర్డులు, విద్యుత్ వెలుగులు, పిల్లల వినోద సదుపాయాలు, భద్రతా చర్యలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.నర్సాపూర్ అర్బన్ పార్క్ మరియు పార్క్ కాటేజీలను కుటుంబ పర్యాటకానికి, వివాహ, వినోద కార్యక్రమాలకు అనువుగా అభివృద్ధి చేయడంతో పాటు, వెంకట్రావుపేట కోట, మెదక్ ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను దేశ విదేశాల పర్యాటకులకు చేరువ చేసే విధంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా టూరిజం శాఖ వారికి సూచించడం జరిగింది.జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, స్థానిక కళలు, సంస్కృతి, హస్తకళలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మెదక్ జిల్లాను తెలంగాణలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, ఇ.డి.యం. సందీప్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్. అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా

**నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మెదక్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు.2022 అక్టోబర్ 10న ఆరోగ్యం బాగాలేక బాలిక ఇంటి వద్దే ఉన్న సమయంలో, టైర్ పంక్చర్ దుకాణం యజమాని మహ్మద్ షంశొద్దీన్ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమె ఇంటికి వెళ్లి, “మీ అమ్మకు ఇవ్వాల్సిన డబ్బులు ఉన్నాయి.. బయటకు వస్తే ఇస్తాను” అంటూ నమ్మించి ఇంటి బయటకు పిలిచాడు. అనంతరం ఆమె చేతిని పట్టుకుని సమీపంలోని పొదల్లోకి బలవంతంగా లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా చాలా సేపు కేకలు వేయడంతో భయపడిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారి ఫిర్యాదు మేరకు అప్పటి శంకరంపేట-ఆర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుభాష్ గౌడ్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి దర్యాప్తు చేపట్టి, బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ ఎవిడెన్స్, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి కోర్టులో పకడ్బందీగా అభియోగపత్రం దాఖలు చేశారు. బాధితురాలికి భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ శ్వేతా న్యాయపరమైన సహకారం అందించడంతో పాటు సాక్ష్య ప్రక్రియలో అండగా నిలిచారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించారు. మెడికల్ ఎవిడెన్స్, సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ ఆధారాలతో పాటు ఇతర సాక్ష్యాలను పరిశీలించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సుభావలి నిందితుడు మహ్మద్ షంశొద్దీన్‌ను దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ శ్రీధర్ తదితరులు విచారణ ప్రక్రియలో సమన్వయం చేసి సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అభినందించారు.

# “అశోక్ మృతిపై మిస్టరీ వీడేదెప్పుడు?..

- ‘మా పిల్లలకు న్యాయం చేయండి’ అంటూ భార్య ఆవేదన”
- అశోకు మరణం పై రాజకీయ నేతల్లో గుబులు.?
- గుండెపోటు వెనుక మానసిక వేధింపులున్నాయా?
- ఫోన్ కాల్స్‌పైనే కుటుంబ సభ్యుల అనుమానం.
- కేసును సీబీసీఐడీకి అప్పగించాలని డిమాండ్.





మంథని, (ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని సింగిల్ విండో ఆఫీసులో 2009లో చిన్న క్లర్క్ గా జాయిన్ అయి 17 సంవత్సరాల పాటు సింగిల్ విండో లో సీఈఓ స్థాయికి ఎదిగాడు. సి ఈఓగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా విధులు నిర్వహించిన అశోక్ ఆకస్మిక మరణం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ నేతల హస్తం ఉన్నట్టు ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.? గుండెపోటుతో మరణించినప్పటికీ, మరణానికి ముందు కొంతకాలంగా ఆయన తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అశోక్‌కు తరచూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చేవని, ప్రతి కాల్ తర్వాత ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యేవారని ఆయన భార్య అర్చన తెలిపింది. ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఆయన ముఖంలో భయం కనిపించేదని, ఎవరో ఒత్తిడి తెస్తున్నారనే అనుమానం తమకు కలిగిందని. ఫోన్ కాల్ డాటా బయటపడితే అసలు నిజాలు బయటకు వస్తాయని ఆమె పేర్కొన్నారు.

సింగిల్ విండోలో అవినీతి వ్యవహారాలకు సంబంధించిన సమాచారం అశోక్‌కు తెలిసి ఉండొచ్చని, ఆ కారణంగానే ఆయనను మానసికంగా వేధించి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మొబైల్ ఫోన్ కాల్ డేటా, ఇతర డిజిటల్ ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని వారు కోరుతున్నారు.స్థానిక పోలీసుల దర్యాప్తుపై తమకు పూర్తి నమ్మకం ఉందని, అయినప్పటికీ, నిజాలు వెలుగులోకి రావాలంటే కేసును సీబీసీఐడీకి బదిలీ చేయాలని అశోక్ కుటుంబ సభ్యులు ఆయన భార్య అర్చన, కుమారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భర్తను కోల్పోవడంతో తాను,నా కొడుకులు ఆధారంలేని స్థితిలోకి వెళ్లిపోయామని, తమకు న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వం ఆదుకోవాలని అశోక్ భార్య అర్చన కన్నీటి పర్యంతమై ఈ మరణం పై స్థానిక మంత్రి దృష్టి సారించి నాకు, నా పిల్లలకు తగు న్యాయం చేయాలని శ్రీధర్ బాబును వేడుకుంటున్నాని విజ్ఞప్తి చేశారు.

## కానిస్టేబుల్ కిరణ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిప్యూటీ పద్మాదేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఆరె. కిరణ్ కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి గురువారం సిద్దిపేటలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా కిరణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కిరణ్ భార్యతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కోల్పోవద్దని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో కిరణ్ మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. తాను డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో కిరణ్ తన గన్‌మెన్‌గా విధులు నిర్వర్తించారని గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించే మంచి పోలీసు సిబ్బందిని కోల్పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కిరణ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా. నరేందర్, న్యాయవాది నాయకులు జీవన్ రావు, పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీది.కృష్ణ గౌడ్,కౌన్సిలర్ దీపక్ కుమార్ తదితరులు ఉన్నారు.

# క్షయ రోగులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ

**పోషకాహారంతోనే టీబీపై విజయం సాధ్యం**

**- డాక్టర్ రేఖా రాణి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమ అధికారి డాక్టర్ నిర్మలారెడ్డి, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ బాబ్జి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేఖా రాణి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో టీబీ బాధితులకు ఉచితంగా న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కిట్లలో సజ్జలు, రాగులు, మల్టీగ్రెయిన్ పిండి, కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు, వేరుశెనగలు, పుట్నాలపప్పు, బెల్లం, వంటనూనె, మల్టీవిటమిన్ పౌడర్ వంటి పోషకాహార పదార్థాలు ఉన్నాయని వివరించారు. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు త్వరగా కోలుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. ఆర్‌ఎంఓ డాక్టర్ రాము మాట్లాడుతూ, టీబీ రోగులు మందులతో పాటు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, అందించిన న్యూట్రిషన్ కిట్‌ను కుటుంబ సభ్యులు కాకుండా రోగులే వినియోగించాలని సూచించారు.టీబీ సూపర్వైజర్ డి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా ప్రతి టీబీ రోగికి నెలకు రూ.1,000 చొప్పున పోషకాహారం కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.6,000 ఒకటి, రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. గజ్వేల్ డివిజన్‌లో ఉన్న 29 మంది టీబీ రోగులందరికీ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీధర్, పాలియేటివ్ కేర్ వైద్యాధికారి డాక్టర్ పల్లవి, క్లస్టర్ సీఎచ్‌ఓ ఎస్. యాదగిరిరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్, టీబీ హెల్త్ విజిటర్ శ్రీకాంత్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్ దేవసాని, ఆశా కార్యకర్తలు, టీబీ రోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## శివోహం అమోఘం నృత్యరూపకం ఆద్యంతం






నాంపల్లి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు నిర్వహించిన శివోహం అమోఘం అనే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో రోహితాక్ష్ తో పాటు పాల్గోన్న పలువురు చిన్నారులు చూపిన నటనా కౌశలం ఆహుతులను ఆకట్టుకుంది. స్పందన ఆర్ట్స్ 35 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని, 200 మంది విద్యార్థులచే ఈ కార్యక్రమంలో ప్రదర్శన ఇవ్వడం విశేషం. ఈ కార్యక్రమంలోనృత్య ప్రదర్శనలో చిన్నారులకు శిక్షణ ఇచ్చిన డాన్స్ మాస్టర్లు ఉమాశంకర్, దనూష్, తో పాటు పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు అధికారులు పాల్గోని చిన్నారులను అభినందించారు.

## కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చేరు (ప్రశ్న న్యూస్ ) పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) గురువారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తిరుమలలో భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఉదయం స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ అనంతరం ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం, అభివృద్ధి చేకూరాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు గూడెం సందీప్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సోమ శీనయ్య, సుధాకర్ గౌడ్, స్వామి వారిని దర్శించుకున్నారు.

# శ్రీవారి దర్శనానికి తొలి ద్వారం
# ఆది వరాహస్వామి



- శ్రీవారి దర్శనానికి తొలి ద్వారం... ఆది వరాహస్వామి తిరుమల క్షేత్రాధిపతి మహిమ
- ముందుగా వరాహస్వామి దర్శనం ఎందుకు?
- పురాణ వైభవం, ఆలయ విశిష్టత, భక్తి సంప్రదాయాలపై ప్రత్యేక కథనం

( వెంకటే -- ఆంధ్రప్రదేశ్ ప్రశ్న న్యూస్ స్టేట్ బ్యూరో)

తిరుమల అంటే వెంటనే మనసుకు గుర్తుకు వచ్చేది కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి. అయితే తిరుమల క్షేత్రంలో శ్రీవారి దర్శనానికి ముందు మరో దైవాన్ని దర్శించుకోవడం శతాబ్దాలుగా కొనసాగుతున్న విశిష్ట ఆచారం. ఆ దైవమే శ్రీ ఆది వరాహస్వామి. తిరుమల క్షేత్రానికి అసలు అధిపతి వరాహస్వామేనని పురాణాలు చెబుతాయి. అందుకే తిరుమలకు వెళ్లిన భక్తులు ముందుగా వరాహస్వామిని దర్శించి, ఆ తర్వాతే శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని ఆగమశాస్త్రాలు సూచిస్తున్నాయి.

### భూదేవిని రక్షించిన వరాహావతారం



దశావతారాల్లో మూడవ అవతారం వరాహావతారం. హిరణ్యాక్షుడు భూమిని సముద్ర గర్భంలోకి తీసుకెళ్లినప్పుడు, మహావిష్ణువు మహావరాహ రూపంలో అవతరించి తన దంతాలపై భూమిని ఎత్తి రక్షించాడు. భూమాతను తిరిగి స్థాపించి సృష్టిని కాపాడిన ఆ మహోన్నత కార్యానికి గుర్తుగా వరాహస్వామి ఆరాధన ప్రారంభమైంది. ఈ అవతారం ధర్మరక్షణకు, సృష్టి పరిరక్షణకు ప్రతీకగా భావిస్తారు.

### తిరుమల క్షేత్రాధిపతి వరాహస్వామే

పురాణాల ప్రకారం, వరాహస్వామి భూదేవిని రక్షించిన అనంతరం శేషాచల పర్వతంపై నివాసం ఏర్పరచుకున్నాడు. తర్వాత కలియుగంలో శ్రీనివాసుడు ఈ పర్వతంపై నివసించేందుకు వరాహస్వామిని అనుమతి కోరాడు. అప్పుడు వరాహస్వామి ఒక షరతు విధించినట్లు కథనం. "ఈ క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ముందుగా నన్ను దర్శించుకుని, నైవేద్యం సమర్పించిన తర్వాతే శ్రీనివాసుడిని దర్శించాలి" అని వరం ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

### స్వామి పుష్కరిణి ఒడ్డున పవిత్ర ఆలయం

శ్రీ ఆది వరాహస్వామి ఆలయం తిరుమలలోని పవిత్ర స్వామి పుష్కరిణి ఉత్తర-పశ్చిమ భాగంలో ఉంది. ప్రధాన ఆలయానికి అత్యంత సమీపంలో ఉండే ఈ ఆలయం ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తులను ఆకట్టుకుంటుంది. బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి ముఖ్య పర్వదినాల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి.

### ముందు వరాహస్వామికే నైవేద్యం

తిరుమలలో శ్రీవారికి సమర్పించే ప్రతి నైవేద్యాన్ని సంప్రదాయం ప్రకారం ముందుగా వరాహస్వామికి సమర్పిస్తారని ఆలయ సంప్రదాయం చెబుతోంది. దీనివల్ల ఈ క్షేత్రంలో వరాహస్వామికి ఉన్న అత్యున్నత స్థానాన్ని అర్థం చేసుకోవచ్చు. భక్తులు కూడా తమ మొక్కుబడులను ముందుగా వరాహస్వామి వద్ద సమర్పించి,



ఆ తర్వాత శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తారు.

### వరాహస్వామి విగ్రహ విశిష్టత

ఆలయంలోని మూలవిరాట్ అత్యంత ప్రాచీనమైనదిగా భావిస్తారు. వరాహమూర్తి మానవ శరీరం, అడవి పంది (వరాహ) ముఖంతో దర్శనమిస్తారు. ఆయన ఒడిలో భూదేవి అమ్మవారు ఆసీనురాలై ఉంటారు. ఇది భూమాత రక్షణకు సంకేతంగా భావిస్తారు. ఈ రూపం విశ్వ పరిరక్షకుడిగా మహావిష్ణువు కరుణను ప్రతిబింబిస్తుంది.

### వరాహ జయంతి ప్రత్యేకత

ప్రతి సంవత్సరం భాద్రపద మాసంలో వచ్చే వరాహ జయంతి సందర్భంగా ఈ ఆలయంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.
విశేష అభిషేకాలు, అర్చనలు, వేదపారాయణాలు, ప్రత్యేక నైవేద్యాలతో ఆలయం భక్తులతో కళకళలాడుతుంది. ఈ రోజున స్వామిని దర్శించుకుంటే ఐశ్వర్యం, ఆరోగ్యం, భూమి సంబంధిత సమస్యలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.

### భూమి, వ్యవసాయానికి అధిదేవుడు

వరాహస్వామిని భూమాతకు రక్షకుడిగా భావిస్తారు. రైతులు, భూములు కొనుగోలు చేసే వారు, వ్యవసాయం చేసే కుటుంబాలు, గృహ నిర్మాణం ప్రారంభించే వారు ప్రత్యేకంగా వరాహస్వామిని ఆరాధిస్తారు. భూమికి సంబంధించిన వివాదాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని విశ్వసిస్తారు.



### ఆధ్యాత్మిక సందేశం

వరాహావతారం కేవలం ఒక పురాణ గాథ మాత్రమే కాదు. చెడుపై మంచి విజయం సాధించడమే కాకుండా, ప్రకృతిని, భూమిని పరిరక్షించడం ప్రతి మనిషి బాధ్యత అనే గొప్ప సందేశాన్ని కూడా అందిస్తుంది. భూమిని తల్లిగా భావించే భారతీయ సంస్కృతికి వరాహస్వామి ఆరాధన ఒక ప్రతీక.

### భక్తులు తప్పక పాటించాల్సిన సంప్రదాయం

తిరుమలకు వెళ్లిన ప్రతి భక్తుడు ముందుగా స్వామి పుష్కరిణి వద్ద నమస్కరించి, ఆపై శ్రీ ఆది వరాహస్వామిని దర్శించి, అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటే క్షేత్రయాత్ర



పరిపూర్ణమవుతుందని పండితులు చెబుతారు. ఈ సంప్రదాయాన్ని పాటించడం ద్వారా తిరుమల యాత్రకు సంపూర్ణ ఫలితం లభిస్తుందనే విశ్వాసం తరతరాలుగా కొనసాగుతోంది.

### భక్తి బాటలో తొలి అడుగు... వరాహస్వామి దర్శనం

శ్రీవారి వైభవం ఎంత గొప్పదో, ఆ వైభవానికి తొలి సాక్షి శ్రీ ఆది వరాహస్వామి. తిరుమల క్షేత్రానికి క్షేత్రపాలకుడిగా, భూమాత రక్షకుడిగా, భక్తుల కోరికలు తీర్చే దైవంగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. అందుకే "ముందు వరాహుడు... తర్వాత వెంకన్న" అనే సంప్రదాయం తిరుమలలో నేటికీ భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ విశిష్ట ఆచారం తిరుమల మహిమను మరింత గొప్పగా చాటుతోంది.

---

## లాలాగూడకు కొత్త సారథి..
# నేరాలపై ఉక్కుపాదం

- లాలాగూడ నూతన ఎస్‌హెచ్‌వోగా బి. రవి కిరణ్ బాధ్యతల స్వీకరణ
- స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం
- ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తానన్న కొత్త ఎస్‌హెచ్‌వో




**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** లాలాగూడ పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)గా బి. రవి కిరణ్ బాధ్యతలు చేపట్టారు. గతంలో అబ్దుల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో డిఐ గా సేవలందించిన రవి కిరణ్ తన క్రమశిక్షణ, సమర్థవంతమైన విధి నిర్వహణతో పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు పొందారు. నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా లాలాగూడ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఆత్మీయ వాతావరణం నెలకొంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రవి కిరణ్ మాట్లాడుతూ లాలాగూడ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే తన లక్ష్యమన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు, అసాంఘిక శక్తుల ఆగడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని కోరారు. పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. మహిళల భద్రత, యువతను నేరాల బాట పట్టకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

---

# ఏపీలో మళ్లీ కరోనా కలకలం

- జూన్ 26 నుంచి జులై 16 వరకు నలుగురి మృతి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

---

# 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

- సీబీఎస్ఈని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై ఇది అదనపు భారాన్ని మోపుతుందని, వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం విచారణ సందర్భంగా కోర్టు కీలకమైన మౌఖిక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టడం సరికాదు. ఆ వయసులో విద్యార్థులు ఇప్పటికే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. అటువంటి సమయంలో కొత్త భాషను ఎందుకు పరిచయం చేస్తారు? అవసరమైతే ఆరో తరగతి నుంచే దీని అమలు చేయండి" అని జస్టిస్ నాగరత్న కేంద్రానికి సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షల తాలూకు ఒత్తిడి ఎనిమిదో తరగతి నుంచే మొదలవుతుందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న సీబీఎస్ఈ నూతన నిబంధనల ప్రకారం, 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. అందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండటం తప్పనిసరి. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, దీని అమలుపై స్టే ఇచ్చేందుకు మాత్రం అప్పట్లో నిరాకరించింది. తమిళనాడులో ద్విభాషా విధానం అమల్లో ఉన్న నేపథ్యంలో, నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించింది. త్రిభాషా సూత్రంలో హిందీ తప్పనిసరి కాదని, సంస్కృతం లేదా ఇతర ప్రాంతీయ భాషలను ప్రత్యామ్నాయాలుగా పరిశీలించవచ్చని పేర్కొంది. నవోదయ విద్యాలయాలకు భూ కేటాయింపులపై తగిన నిర్ణయం తీసుకునేందుకు తమిళనాడు ప్రభుత్వానికి ఆగస్టు 11 వరకు సమయం ఇచ్చింది. ప్రస్తుత విచారణలో కోర్టు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ధర్మాసనం చేసిన మౌఖిక వ్యాఖ్యలు విద్యా వర్గాల్లో ప్రాధాన్యత

---

## నాచారం చెరువు
# సుందరీకరణ షురూ

- రూ.28 కోట్ల వ్యయంతో 9 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక
- చెరువు అభివృద్ధి ద్వారా వరద ముంపు సమస్యకు పరిష్కారం



**నాచారం (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని ఉప్పల్ పరిధిలో గల నాచారం పెద్ద చెరువు పునరుజ్జీవం పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 28 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను తొమ్మిది నెలల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. సుమారు 108.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా చెరువులో 10 అడుగుల లోతు వరకు పూడిక తీయడం, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, కట్టను పటిష్ఠం చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. కట్టపై పాదచారుల మార్గాలు, ల్యాండ్‌స్కేప్ పార్కులు, చిన్నారుల కోసం ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లు, యోగా వేదికలను ఏర్పాటు చేయనున్నారు. స్థానికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలకు ఈ ప్రాజెక్టు ద్వారా పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు. చెరువులోకి మురుగునీరు చేరడం, దుర్వాసన, దోమల బెడదతో పాటు సమీప కాలనీల్లో వరద ముంపు సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల భూగర్భ జలమట్టం కూడా మెరుగుపడుతుందని వివరించారు. అనంతరం, కమిషనర్ రంగనాథ్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా యాప్రాల్‌లోని నాగిరెడ్డి కుంటను సందర్శించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో, ప్రభుత్వ భూముల్లో కబ్జాలు జరుగుతున్నాయని, వరద కాలువలను పూడ్చివేయడం వల్ల తమ కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కమిషనర్, ఆక్రమణలను తొలగించి, నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

---

## వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై
# ఉక్కుపాదం

- గజ్వేల్‌లో నాలుగు అక్రమ నిర్మాణాల కూల్చివేత
- వక్ఫ్, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు సహించం, మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక





**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జాలిగామ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వక్ఫ్ బోర్డుకు చెందిన భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నాలుగు అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు భూములు, ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టే వారిపై, ప్రభుత్వ లేదా వక్ఫ్ భూములను ఆక్రమించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు ప్లాట్లు లేదా స్థలాలు కొనుగోలు చేసే ముందు సంబంధిత భూమికి సంబంధించిన పూర్తి వివరాలు, అనుమతులు, యాజమాన్య సమాచారాన్ని మున్సిపల్ కార్యాలయంలో ధృవీకరించుకోవాలని సూచించారు. అధికారిక సమాచారం తెలుసుకున్న తర్వాతే కొనుగోలు ప్రక్రియ చేపట్టి మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588